1 YEAR HAPPY WORK ANNIVERSARY...

షణ్ముఖ

# వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 2 సంచిక : 41 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 4 జనవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 41 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 4 january 2025 PAGES : 8 PRICE : 5/-


### నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువాళ్లు మరింత

# ఉన్నతస్థితికి ఎదగాలి



- ప్రపంచ మార్కెట్ కైవసం చేసుకునే స్థాయికి తెలుగు సినీ పరిశ్రమ చేరడం గర్వకారణం: చంద్రబాబు
- హైదరాబాదులో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు
- హాజరైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- గిడుగు రామ్మూర్తి, రామోజీరావు వంటి పెద్దలను స్మరించుకోవాలని వెల్లడి
- వివిధ రంగాల్లో తెలుగువారు బ్రహ్మాండంగా రాణిస్తున్నారని హర్షం

**హైదరాబాద్**

"థింక్ గ్లోబల్లి, యాక్ట్ లోకల్లీ ఇప్పుడు ఇదే మన స్లోగన్" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువాళ్లు మరింత ఉన్నతస్థితికి ఎదగాలని అన్నారు. ప్రపంచంలో ఉండే తెలుగు వారు అందరిని ఇక్కడ చూస్తున్నామని అన్నారు. తెలుగువాడిగా మీ అందరికి స్వాగతం పలుకుతున్నానని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఈ మహాసభను ప్రారంభించారని గుర్తుచేశారు. అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు ఎక్కడ ఉన్నా తెలుగు జాతి మనదని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఇవాళ(శుక్రవారం) ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలను ఏపీ సీఎం చంద్రబాబు ప్రారంభించారు. మూడు రోజుల పాటు తెలుగు మహాసభలు జరుగనున్నాయి. తెలుగు ప్రముఖులు, సాహితీవేత్తలు, కళాకారులు, కృష్ణ ఎల్ల, మురళీ మోహన్, ఎంపీ మేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కంభంపాటి రామ్మోహన్‌రావు, తదితరులు హాజరయ్యారు. ప్రపంచ తెలుగు మహా సభల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను విడి విడిగా సందర్శించి నిర్వాహకులతో సీఎం చంద్రబాబు నాయుడు , భువనేశ్వరిలు ముచ్చటించారు. "రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, జీఎంసీ బాలయోగి, - మిగతా3లో



### బుడమేరు పాపం

# అంతా వైసీపీదే

- బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్
- వెలగలేరు రెగ్యులేటర్ నుంచి కొల్లేరు వరకు ఓల్డ్ ఛానెల్ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన
- బుడమేరు వరదల నియంత్రణకు కేంద్రం సహకారం కోరతాం
- బుడమేరు వరదల వల్ల 34 వార్డులలో 5 లక్షల మంది 4 రోజులు నీళ్ళలోనే ఉన్నారు



### కొత్త ఎయిర్‌పోర్టు నిర్మాణ

## పనులు వేగవంతం కావాలి

- తాడిపత్రి వద్ద ఎయిర్ పోర్టుకు అవకాశంపై పరిశీలించాలి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి**

రాష్ట్రంలో కొత్తగా 7 ఎయిర్ పోర్టులు రానున్నాయి. వీటిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ ప్రాజెక్టులను గ్రౌండ్ చేసే పనులు మొదలు పెట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 7 ఎయిర్ పోర్టులు ఉన్నాయి. విశాఖ, తిరుపతి, కడప, రాజమండ్రి, గన్నవరం ఎయిర్ పోర్టులను ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. కర్నూల్ ఎయిర్ పోర్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుండగా.... పుట్టపర్తి ప్రైవేటు ఎయిర్ స్ట్రిప్ గా ఉంది. వీటికి తోడు భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ సిద్ధం అవుతోంది. అయితే పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో కొత్తగా మరో 7 ఎయిర్ పోర్టులను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే కొన్ని ప్రాజెక్టులకు అడుగులు వేయగా...తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ - మిగతా3లో

### ఆ నమ్మకం నాపై ఉంచండి..

# స్వర్ణాంధ్ర సాధిస్తా

- గణపతిసచ్చిదానంద స్వామి ఆశీస్సులు పొందిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రం కోసం గణపతి సచ్చిదానందస్వామీజీ పూజలు
- సీఎం చంద్రబాబు నాయుడు




**విజయవాడ**

"స్వర్ణాంధ్ర నా సంకల్పం" అని అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలో గణపతి సచ్చిదా నంద స్వామీజీ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ 42 ఊర్లలో దత్తక్షేత్ర నాద యాత్ర- 2025ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... విజన్ 2020 అంటే అప్పట్లో అందరికి అర్థం కాలేదు కానీ ఇప్పుడు అర్థం అవుతోందన్నారు. ఇపుడు - మిగతా3లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



- ముగ్గురు మావోలు హతం
- సోర్నామల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు
- అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో స్థానిక పోలీసులు, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు సెర్చ్ ఆపరేషన్

### రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా

# ఢిల్లీని తీర్చిదిద్దుతాం

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ
- కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు
- వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందులపడుతుంది

# జగన్‌వి అన్నీ ప్రగల్భాలే..

# రాష్ట్రాన్ని భష్టు పట్టించారు

ఐదు సంవత్సరాలలో రూ.5 లక్షల కోట్లు అప్పులు చేశారు

అతను చేసిన అప్పులకు రూ.22 వేల కోట్లు వడ్డీ కడుతున్నాం

వైసీపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చి ప్రజలను మాయ చేద్దామని చూశారు : మంత్రి అచ్చెన్నాయుడు



**కాకినాడ**

ముమ్మిడివరం నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ఉన్న మత్యకారులకు ఓన్‌జీసీ సంస్థ శ్రీకారం చుడితే తానే చేశానని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రగల్భాలు పలికారని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యారని.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఐదు సంవత్సరాలలో రూ.5 లక్షల - మిగతా3లో

# నేను కూడా శీష్ మహల్ కట్టగలను




- కావాలంటే అద్దాలమేడ కట్టుకునేవాడిని..
- ఆమ్ ఆద్మీ పార్టీపై ప్రధాని మోదీ విమర్శలు
- గత పదేళ్ల నుంచి ఢిల్లీని ఆపద చుట్టేసింది
- అన్నాహజారేను ముందు పెట్టి, కొందరు నిజాయితీలేని వాళ్లు ఢిల్లీని ఆపదలోకి నెట్టేశారు
- ఆప్ పార్టీ.. ఢిల్లీపై ఆపదలా పడి, మొత్తం దోచేసుకుంటోంది

# నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువాళ్లు మరింత ఉన్నతస్థితికి ఎదగాలి

-మొదటిపేజీ తరువాయి

వెంకయ్యనాయుడు... సుప్రీంకోర్టు సీజేఐగా జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ ఎన్వీ రమణ వంటి తెలుగు వారు తమ పదవుల్లో రాణించారు. ఇవాళ తెలుగు వారు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. క్రీడల్లో కరణం మల్లీశ్వరితో ప్రారంభమైన ప్రస్థానం... పుల్లెల గోపీచంద్, ద్రోణవల్లి హారిక, వీవీఎస్ లక్ష్మణ్, వెంకటపతిరాజు, పీవీ సింధు, పెంటేల హరికృష్ణ, కోనేరు హంపి, మొన్ననే సెంచరీ కొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి వరకు ఎంతోమంది తెలుగువారు క్రీడల్లో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు.

మరోవైపు... మొన్నటివరకు చెన్నైలో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాదుకు తీసుకురావాలని మేమంతా ప్రయత్నాలు చేశాం. ఇవాళ తెలుగు ఫిలిం ఇండస్ట్రీని చూస్తే భారతదేశంలోనే నెంబర్ వన్ చిత్ర పరిశ్రమగా తయారైంది. ప్రపంచ మార్కెట్ ను కైవసం చేసుకునే స్థాయికి తెలుగు చిత్ర పరిశ్రమ చేరుకోవడం మనందరికీ గర్వకారణం.

కూచిపూడి నృత్యం గురించి చెప్పుకోవాల్సి వస్తే... ఆ కళా రూపం మన సొంతం. ఎన్నో ఏళ్లుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ఉన్న బతుకమ్మ కూడా ఇలాంటిదే. పొట్టి శ్రీరాములు సంకల్పం మనలో ఉంది... టంగుటూరి ప్రకాశం పంతులు గుండె ధైర్యం మనలో ఉంది... అల్లూరి సీతారామరాజు పౌరుషం మనలో ఉంది... ఎన్టీఆర్ ఆత్మాభిమానం మనలో ఉంది... పీవీ నరసింహారావు చాణక్యనీతి, తెలివితేటలు మనలో ఉన్నాయి... ఇవన్నీ ఉండగా నా ఆకాంక్ష ఒక్కటే. 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ కమ్యూనిటీ ఏదంటే... దానికి చిరునామాగా తెలుగు జాతి ఉండాలనేదే నా ఆకాంక్ష. అది జరగాలంటే ఒక సంకల్పం ఉండాలి. అందుకోసం కృషి చేయాలి.

ఒకప్పుడు హార్డ్ వర్క్ చేసేవారు... కానీ ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలి. ఒకప్పుడు కష్టపడి పనిచేయాలని చెప్పేవారు. కానీ ఇప్పుడు టెక్నాలజీ వచ్చింది... స్మార్ట్ గా పనిచేస్తే ఏదైనా సాధ్యమే అని చెబుతున్నా. టెక్నాలజీ వల్ల నష్టాలు ఉన్నాయి, దీని వల్ల మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయని చాలామంది అంటున్నారు. అయితే టెక్నాలజీని సరైన రీతిలో ఉపయోగిస్తే ప్రపంచాన్ని కూడా శాసించే శక్తి వస్తుంది. అదే టెక్నాలజీకి బానిసగా మారి, దుర్వినియోగం చేస్తే పిచ్చి పట్టే పరిస్థితి వస్తుంది! ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలను ఏర్పాటు చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. భగవంతుడు నాకు ఎంత శక్తి ఇస్తాడో అంత



శక్తినీ ఉపయోగించి... తెలుగుజాతిని నెంబర్ వన్ చేసేందుకు ఏమేం చేయాలో అవన్నీ చేస్తాను. తెలుగు జాతి అంతా ఒక్కటే... మనకు విభేదాల్లేవు. అన్ని విషయాల్లో తెలుగు వారు సమష్టిగా దూసుకుపోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఇలాంటి మహాసభల వల్ల మనలో ఉన్న సంకల్పం పట్ల పునరంకితం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది" అని చంద్రబాబు వివరించారు.

**జీరో ప్రాపర్టీ మన లక్ష్యం కావాలి..**

బ్రెయిన్ డ్రైన్ ఏ బ్రెయిన్ గైన్ అవుతుందని గతంలోనే చెప్పానని గుర్తుచేశారు. ఏపీ, తెలంగాణలో ఉండే వారి కంటే విదేశాల్లో ఉండే వారు భాష, సంప్రదాయాన్ని ఎక్కువగా గౌరవిస్తున్నారని ఉద్ఘాటించారు. రాళ్లు రప్పలున్న ఈ ప్రాంతాన్ని మేటి సిటీగా అప్పట్లోనే తీర్చిద్దానని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రతి ఇంట్లో ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఉండాలని చెప్పుకొచ్చారు. పెట్టుబడుల కంటే ఐడియాలు చాలా ముఖ్యమని తెలిపారు. చిన్న ఆలోచనతో ర్యాపిడో స్థాపించి గొప్పగా రాణించారని అన్నారు. కోవర్కింగ్ స్పేస్ ద్వారా వేలమందికి ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. వినూత్నంగా ఆలోచిస్తే తెలుగువాళ్లు మరింత రాణిస్తారన్నారు. జీరో ప్రాపర్టీ మన లక్ష్యం కావాలని సూచించారు. 90 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందించిన ఘనత మనదని చెప్పారు. పీపీపీ విధానంలో అనేక ప్రాజెక్టులు కట్టుకున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. పీపీపీ విధానం.. భవిష్యత్‌లో మరింత విస్తరించాలని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఐటీకి ప్రాధాన్యం ఇచ్చాం..**

"ఆర్థిక ఇబ్బందులతో ఒక దశలో 3 నెలలకు ఒకసారి వేతనాలు ఇచ్చాను. అందరం కలిస్తే ఏదైనా సాధించగలం. సైబరాబాద్‌ను నిర్మించడమే కాదు ప్రపంచంలోనే మేటిగా తీర్చిదిద్దటంలో తెలుగుదేశం పార్టీ పాత్ర ఉంది. తెలుగు వారికి ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఉన్నాయి. అప్పట్లో వేసిన పునాదులతో ఇప్పుడు తెలంగాణ అత్యధిక పర్ క్యాపిటల్ ఉన్న రాష్ట్రంగా ఎదిగింది. సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ సీఈఓగా ఎదిగాడు అంటే అది తెలుగు వారి ఘనత. ఐటీకి ప్రాధాన్యత ఇస్తే చాలామంది ఎగతాళి చేశారు. అమెరికా కాదు ఏ దేశం వెళ్లినా అక్కడ తెలుగు వారు ఉన్నారు. అమెరికాకు ఏడాదిలోనే 1.5 లక్షల మంది వరకు తెలుగు వారు చదువుకునేందుకు వెళ్లారు. అవకాశాల కోసం విదేశాలకు వెళ్లడంలో తప్పులేదు. మాతృదేశాన్ని మర్చిపోకూడదు ... అలాగే పని చేస్తున్న దేశాలకు కూడా సేవ చేయాలి. ప్రతి ఒక్క ఇంటికి ఐటీ ఉద్యోగి ఉండటమే కాదు ప్రతి ఇల్లు ఏఐను వినియోగించుకోవాలి. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలి. డబ్బు కంటే గొప్ప వ్యాపార ఆలోచన ముఖ్యం. తెలుగు జాతి ఒకరికి ఒకరు పరస్పరం సహకరించుకోవాలి. 2047కు భారత్ ప్రపంచంలోనే మొదటి, రెండో స్థానంలో ఉంటుంది. విజన్ 2047ను స్వర్ణాంధ్ర ప్రదేశ్ కోసం నేను చేస్తున్నాను. కో వర్కింగ్ స్పేస్ ద్వారా ఏపీలో 5 వేల ఉద్యోగాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పేదరికం లేని సమాజం కోసం అందరం కృషి చేయాలి" అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

**జనాభా విషయంలో జాగ్రత్త..**

"బయోటెక్నాలజీ గురించి మాట్లాడితే అప్పట్లో కృష్ణా ఎల్లా మాత్రమే గుర్తుకు వచ్చేవారు. కొందరు ధనవంతులు అవుతుంటే పేదవాడు పేదవాడిగా మిగిలిపోతున్నాడు. ప్రతి ఒక్కరూ పేదరికంలో ఉన్న కనీసం 10 కుటుంబాలను గైడ్ చేసి పైకి తీసుకు రావాలి. దక్షిణ భారత్‌లో జనాభా తగ్గుతోంది. జనాభా విషయంలో జాగ్రత్త పడాలి. డబుల్ ఇన్ కం నో కిడ్స్ అనే ఆలోచన పెరుగుతోంది. భార్య భర్త ఇద్దరి సంపాదన, పిల్లలు వద్దు అనే ఆలోచన సరైంది కాదు. మనం తయారు చేసే ఉత్పత్తుల క్వాలిటీ పెరగాలి, ఆ దిశగా కృషి చేస్తున్నాం. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధించేందుకు కృషి చేస్తున్నాం. డీప్ టెక్ భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తుంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఉద్యమంలో భాగస్వాములు అవ్వండి. తెలుగు వారికి మొదటిసారి గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. పొట్టి శ్రీరాములు ఆత్మర్పణ చేసిన తర్వాత ఏపీ ఏర్పడింది. అలాంటి వారిని గుర్తుపెట్టుకోవాలి" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఆ నమ్మకం నాపై ఉంచండి.. స్వర్ణాంధ్ర సాధిస్తా

-మొదటిపేజీ తరువాయి

విజన్ 2047 కోసం పనిచేస్తున్నానని తెలిపారు. సంపద సృష్టించినా ఆనందంగా ఉండటం ముఖ్యమన్నారు. ఆనందంగా ఉండాలంటే స్వామీజీల వల్ల సాధ్యమవుతుందని అన్నారు. స్వామీజీపై పెట్టిన నమ్మకంతో కొంత పాలకులైన తనపై పెడితే స్వర్ణాంధ్ర సాధిస్తామని చెప్పుకొచ్చారు. అందరూ యదార్థాలని కూడా చెప్పేలా ఉండాలని.. ప్రతి ఒక్కరికీ స్పిరిచాలిటీ ఉండాలని తెలిపారు. భగవంతుని ఆశీస్సులు మనకి ఉండాలన్నారు. గణపతి సచ్చిదానంద ఆశీస్సులు తీసుకోవటం ఆనందంగా ఉందని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్నపుడు పూజ చేసి ఫలితాన్ని తన చేతికి ఇచ్చారన్నారు. మంచికోసం స్వామీజీ పరితపిస్తారని కొనియాడారు. స్వామీజీ ని ఎప్పుడు కలిసినా మనశాంతి దొరుకుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

**రఘురామ కేసులో ట్విస్టు.. విచారణకు రాలేనంటూ..**

"గణపతి సచ్చిదానం స్వామీజీ దర్శనం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఆయన ఆశీస్సులు తీసుకున్నా. ఒక మంచి మనుసుతో స్వామీజీ ఆశీర్వదిస్తారు. సమాజం కోసమే





స్వామీజీ పనిచేస్తున్నారు. నేను కష్టాల్లో ఉన్నప్పుడు ఆయన పూజ చేసి ఆ ఫలితాన్ని నా చేతికిచ్చారు. ఒక మంచి కోసం ఏ విధంగా ఆలోచిస్తారనేదానికి స్వామిజీ ఒక ఉదాహరణ. దత్త క్షేత్రాలు పెట్టి భక్తుల కోసం వస్తారన్నారు. స్వామీజీని ఎప్పుడు కలిసినా.. ఎన్నిసార్లు కలిసినా అక్కడే ఉండాలని అనిపిస్తుంది. ఆయన దగ్గర మనశాంతి దొరుకుతుంది. విజన్ 2020 అంటే సమైక్యాంధ్రలో చాలా మంది తప్పుబట్టారు. కానీ ఆ విజన్ ఈరోజు యదార్థ రూపాన్ని చూపిస్తోంది. ఇప్పుడు విజన్ 2047 స్వర్ణాంధ్ర దిశగా ఆలోచిస్తున్నాం. సంపద ఇవ్వడంలో ముందుకు వెళ్తాం. కానీ ఆనందంగా ఉండాలంటే స్వామీజీ వల్లనే సాధ్యం. భగవంతుడు ఆశీస్సులు కావాలంటే.. ఆ భగవంతుడికి దగ్గర చేసే వ్యక్తే గణపతి సచ్చిదానంద స్వామి. నాదస్వరంతో సమస్యలు పరిష్కారం చేసే శక్తి గణపతి సచ్చిదానంద స్వామి సొంతం. రాష్ట్రంలో స్వామీజీ ఉన్నంత వరకు శుభమే జరుగుతుంది. ప్రజలకు మంచి జరగాలని, దేవుడి ఆశీర్వాదం ఉండాలని స్వామీజీ భావిస్తున్నారు. నేను కూడా స్వామీజీ ఆశీస్సులతో ప్రజలకు ఆర్థిక స్వావలంబన కలగాలని, పేదరికం పూర్తిగా పోవాలని, ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ఆశిస్తున్నా. దానికి స్వామిజీ ఆశీస్సులు ముఖ్యం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# కొత్త ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు వేగవంతం కావాలి

-మొదటిపేజీ తరువాయి

వాటిని పట్టాలు ఎక్కించేందుకు, భవిష్యత్ అవసరాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎయిర్ పోర్టుల విస్తరణ, నిర్మాణంతో పాటు, కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సమీక్ష చేశారు. ఈ సమీక్షకు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్తగా కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జున సాగర్, తుని%-%అన్నవరం, ఒంగోలులో కొత్తగా ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయనుంది. కుప్పం ఎయిర్ పోర్ట్ కోసం ఫీజిబులిటీ రిపోర్ట్ సిద్ధం చేశారు. రెండు దశల్లో ఈ ఎయిర్ పోర్టు నిర్మాణం జరగనుంది. మొదటి దశలో 683 ఎకరాలు, 2వ దశలో 567 ఎకరాలు కలిపి మొత్తం 1,250 ఎకరాలు ఇప్పటికే గుర్తించారు. అయితే దీనికి సమీపంలో ఐఎఎఫ్, హెచ్ఎఎల్, బెంగుళూరు ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టులు ఉన్న కారణంగా... ఎయిర్ స్పేస్ అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ఈ కారణంగా దీనికి సంబంధిత వర్గాల నుంచి ఎన్‌వోసి తీసుకోవాల్సి ఉంది. శ్రీకాకుళం ఎయిర్ పోర్టు విషయానికి వస్తే ఫీజిబులిటీ సర్వే పూర్తి అయ్యింది. రెండు ఫేజుల్లో 1,383 ఎకరాల్లో దీన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే భూ సేకరణ ప్రారంభం అయ్యింది. ఫేజ్ 1లో 680, ఫేజ్ 2లో 536 ఎకరాల్లో దీన్ని చేపట్టనున్నారు. దగదర్తి ఎయిర్ పోర్టు నిర్మాణం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించారు. 1379 ఎకరాల్లో నిర్మించాలని నాడు నిర్ణయించగా... అందులో 635 ఎకరాల భూసేకరణ టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది. మరో 745 ఎకరాలు సేకరణ చేయాల్సి ఉంది. ఈ ఎయిర్ పోర్టుకు అన్ని అనుమతులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బిపిసిఎల్ రిఫైనరీ వస్తోంది. వీటికి తోడు ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివద్ధి చెందుతోంది. దీన్ని దష్టిలో పెట్టుకుంటే ఇది కార్గోకు, ఇండస్ట్రీకి ఉపయోగపడేలా మంచి ఎయిర్ పోర్టు అవుతుంది. అదే విధంగా శ్రీ సిటీ సెజ్ లో ఎయిర్ స్ట్రిప్ట్ తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సిఎం చంద్రబాబు సూచించారు. ఒంగోలు ఎయిర్ పోర్ట్ కోసం 657 ఎకరాలు గుర్తించారు. దీనిపై ఫీజిబులిటీ స్టడీ చేయాల్సి ఉంది. పల్నాడు జిల్లా పరిధిలో నాగార్జున సాగర్ వద్ద 1670 ఎకరాల్లో ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయనున్నారు. దీనిలో 500 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీనికి ఫారెస్ట్ క్లియరెన్స్ కావాలి. తాడేపల్లిగూడెం ఎయిర్ పోర్టు 1123 ఎకరాల్లో చేపట్టాలని నిర్ణయించారు. అయితే దీని సమీపంలో అటు రాజమండ్రి, ఇటు గన్నవరం ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దీంతో ఇక్కడ ఎయిర్ పోర్టు ఫీజిబులిటీని పరిశీస్తున్నారు. ఇకపోతే తుని%-%అన్నవరం మధ్య 757 ఎకరాల్లో ఎయిర్ పోర్టు తేలవాలని ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాంతంలో రైల్వే లైన్, హైవే, వాటర్ బాడీ ఉందని అధికారులు తెలిపారు. అనకాపల్లి



జిల్లాలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్, సిటీలు వస్తున్నాయని... ఆ ప్రాంతంలో ఎయిర్ పోర్టు అవసరం ఉందని సిఎం అన్నారు. అనకాపల్లి, కాకినాడ, విశాఖలకు దగ్గరలో ఈ ఎయిర్ పోర్టు వచ్చేలా చూడాలని సిఎం అన్నారు. అదే విధంగా... తాడిపత్రి ప్రాంతంలో ఒక ఎయిర్ పోర్టుకు అవకాశం ఉందని... దాన్ని కూడా పరిశీలించాలని సిఎం చంద్రబాబు సూచించారు. అనంతరం గన్నవరం ఎయిర్ పోర్టు విస్తరణ పనులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. టెర్మినల్ పనుల్లో నూతన డిజైన్లను అధికారులు సిఎం వద్ద ప్రదర్శించారు. కూచిపూడి నత్యం, అమరావతి స్థూపాలు థీమ్ గా ఎయిర్ పోర్టు డిజైన్లు సిద్ధం చేశారు. ఈ పనులను 6 నెలల్లో పూర్తి చేసి జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని సిఎం సూచించారు. అదేవిధంగా భోగాపురం ఎయిర్ పోర్టు పనుల పురోగతిని కూడా అధికారులు వివరించారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టులతో పాటు ఏవియేషన్ యూనివర్సిటీ, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ఎయిర్ పోర్టుల్లో ప్రైవేటు ఫ్లైట్స్ పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని... వాటిని కూడా దష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని సిఎం సూచించారు.

## జగన్‌వి అన్నీ ప్రగల్భాలే.. రాష్ట్రాన్ని భష్టు పట్టించారు

-మొదటిపేజీ తరువాయి

కోట్లు అప్పులు చేశారని.. అతను చేసిన అప్పులకు రూ.22 వేల కోట్లు వడ్డీ కడుతున్నామని.. మొత్తం రాష్ట్రాన్ని దోచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 లో తాము వచ్చేటప్పటికీ రాష్ట్రం వెంటిలీటర్‌పై ఉందన్నారు. ఆరు మాసాల్లో కేంద్ర ప్రభుత్వం సహకరించడంతో రాష్ట్రనికి ఆక్సిజన్ అందిందన్నారు. వాలంటీర్ల కంటే రెండు గంటల ముందే పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. వైసీపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చి ప్రజలను మాయ చేద్దామని చూశారని.. తాము వచ్చిన వెంటనే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశామన్నారు.

అన్ని హామీలు నెరవేర్చే.. మరల తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో కి వెళతామని స్పష్టం చేశారు. రాష్ట్ర సంపద ఉద్యోగుల జీతాలకు సరిపోవడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.8,400 కోట్లు తల్లికి వందనం ఇస్తామన్నారు. మత్యకారులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. 2014లో టీడీపీ మత్యకారులను అన్ని విధాలుగా ఆదుకుందని.. మరలా మత్స్యకారుల జీవనోపాధి పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలో జట్టీలను అభివృద్ధి చేసి మత్యకారుల వలసలు అరికడతామన్నారు. ఏప్రిల్ 1కి వేట నిషేధంలో ఉన్న మత్స్యకారులకు రూ.20 వేలు ఇచ్చి ఆదుకుంటామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఆరు నెలల్లో లక్ష 80 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయని.. 20 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. జగన్ అనే దెయ్యాని మరలా రాష్ట్రం వైపు చూడకుండా చూస్తాం..దానికి ప్రజలు సహకరించాలని కోరారు. రాజకీయాల్లోకి వచ్చి నష్ట పోయిన వ్యక్తి ఎమ్మెల్యే బుచ్చిబాబు అని.. అభివృదే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## బుడమేరు పాపం అంతా వైసీపీదే



**అమరావతి :** బుడమేరు వరద నియంత్రణపై మంత్రులు నిమ్మల రామానాయుడు, నారాయణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో విజయవాడకు వరద సమస్య లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వరద నియంత్రణ చర్యలు చేపట్టడంపై చర్చించారు. అలాగే బుడమేరు, కృష్ణానదికి ఒకేసారి వరద వస్తే ఏం చేయాలన్న దానిపై ప్రధానంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. బుడమేరు వరద నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమగ్ర నివేదిక అందించేలా ఇరిగేషన్, మున్సిపల్, రెవిన్యూ శాఖల అధికారులతో సమీక్ష చేశామని తెలిపారు. బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ నుంచి కొల్లేరు వరకు ఓల్డ్ ఛానెల్ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన చేశామని అన్నారు. గత టీడీపీ హాయాంలోనే బుడమేరు డైవర్షన్ ఛానెల్ 35 వేల క్యూసెక్కులకు పెంచేలా రూ.464 కోట్లతో టెండర్లు అప్పగించి 80 శాతం పనులు పూర్తి చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బుడమేరు విస్తరణకు నిధులు ఉన్నా మిగిలిన 20 శాతం పనులకు సంబంధించి తట్ట మట్టి గానీ, బస్తా సిమెంట్ పని గానీ చేయలేదని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం.. చేసిన పాపం ఫలితమే బుడమేరు ముంపుకు కారణమని అన్నారు. గత టీడీపీ హయాంలో ఎనికేపాడు యూటీ నుంచి కొల్లేరు వరకు వెళ్ళే ఛానల్ విస్తరణ పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బుడమేరు ఛానెల్‌కు సమాంతరంగా ఓల్డ్ ఛానెల్‌ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమర్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా బుడమేరు యాక్షన్ ప్లాన్‌కు రంగంలోకి దిగుతామని తెలిపారు. బుడమేరు వరదల నియంత్రణకు కేంద్రం సహాకారం కోరతామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.


**దాన్ని కూడా రాజకీయం చేశారు: నారాయణ**

బుడమేరు వరదల వల్ల 34 వార్డులలో 5 లక్షల మంది 4 రోజులు నీళ్ళలోనే ఉన్నారని మంత్రి నారాయణ అన్నారు. కనీసం రోజు వారీ అవసరాలకు కూడా నీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల అవసరాలకు రోజుకు 20 నుంచి 30లక్షల వాటర్ బాటిళ్ళు పంపిణీ చేశామని తెలిపారు. వాటర్ బాటిళ్ళ పంపిణీని కూడా వైసీపీ రాజకీయం చేసిందని మండిపడ్డారు. గతంలో వైసీపీ ప్రభుత్వం బుడమేరు టెండర్లు రద్దు చేయకుండా ఉంటే విజయవాడకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. బుడమేరు వరదలకు వైసీపీనే కారణమన్నారు. జనవరి 18న మరో మారు ఇరిగేషన్, మున్సిపల్,రెవిన్యూ శాఖలు సమావేశమవుతామని మంత్రి నారాయణ వెల్లడించారు.

## ముందుకు సాగేదెలా...

**విజయవాడ :** వైసీపీ అధినేత జగన్ కు ఇప్పుడు ఎన్నడూలేని విధంగా భయం పట్టుకుంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. బీజేపీయే జమిలి ఎన్నికలు జరిగినా అధికారంలోకి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో తనకు ఇక ఆంధ్రప్రదేశ్ లో గెలుపునకు అవకాశం లేదన్న భయం ఆయను వెంటాడుతుందని చెబుతున్నారు. జగన్ బీజేపీ పెద్దలతో సఖ్యత గా ఉన్నప్పటికీ ఆ పార్టీతో నేరుగా సంబంధాలు మాత్రం పెట్టుకోలేదు. పొత్తు కుదుర్చుకోకపోవడం వల్లనే మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని గట్టిగా నమ్ముతున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ అదే కూటమితో పోటీ పడి తన పార్టీ విజయం వైపు వెళుతుందా? అన్న అనుమానం క్యాడర్ తో పాటు లీడర్ లోనూ కలుగుతుంది. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పుడే జగన్ ఈవీఎంల మీద నెపం నెట్టారు. ఈవీఎంల ద్వారా మ్యాజిక్ చేయకపోతే కూటమికి అంత భారీ స్థాయిలో విజయం దక్కేది కాదని, అదే సమయంలో తమకు కూడా అంత తక్కువ సంఖ్యలో సీట్లు వచ్చేవి కావని నమ్ముతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించడం వెనక ఈవీఎంలే కారణమని చెబుతున్నారు. అనేక ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో జమిలి ఎన్నికలు వచ్చినప్పటికీ ఈసారి కూడా తనకు విజయం దక్కే అవకాశాలు ఎంత వరకూ ఉన్నాయన్న దానిపై అనేక అనుమానాలు వైసీపీ నేతల్లో వ్యక్తమవుతున్నాయి. కూటమి బలంగా ఉండటంతో పాటు బీజేపీతో కలసి ఉండటంతో వచ్చే ఎన్నికల్లోనూ అధికారానికి దూరంగా ఉంటామని భావిస్తున్నారు. అది గ్రహించి వైసీపీ నుంచి కీలక నేతలు పార్టీని వీడి వెళ్లిపోతున్నారన్నది కూడా జగన్ దృష్టికి వచ్చిందట. కూటమిని వచ్చే ఎన్నికల్లోనూ ఎదుర్కొనడం కష్టమని భావించిన నేతలు తమ దారి తాము చూసుకుంటున్నారు. జగన్ కు ఇప్పుడు బీజేపీ నేరుగా సాయం అందించే పరిస్థితుల్లో మాత్రం లేదు. అధికారంలో లేకపోవడంతో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నుంచి మద్దతు పుష్కలంగా ఉండటంతో జగన్ ను పార్టీ కేంద్ర నాయకత్వం కూడా పట్టించుకోవడం మానేసిందంటున్నారు. అంతేకాకుండా జగన్ పార్టీ వల్ల బీజేపీకి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉపయోగం ఏమీ లేనందున జగన్ ను దూరం పెట్టారంటున్నారు. ఢిల్లీలో వైసీపీకి చెందిన నేతలు చేసిన సయోధ్య ప్రయత్నాలు కూడా ఫలించలేదని చెబుతున్నారు ఈ క్రమంలోనే ఈ గండం నుంచి బయటపెడేదెలా? అన్నది జగన్ కు అర్థం కాకుండా ఉంది. కీలక నేతలు వెళ్లిపోయినా క్యాడర్ లో నుంచి లీడర్లను ఎంపిక చేస్తున్నప్పటికీ వారు ఎంత వరకూ విజయం దిశగా పయనిస్తారన్నది పెద్దడౌటు. పర్చూరు నియోజకవర్గంలో గాదె కుటుంబానికి మళ్లీ టిక్కెట్ ఇవ్వడం కూడా ఇందులో భాగమేనంటున్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

నూతన సంవత్సరం సందర్భంగా విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని గురువారం రాత్రి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు. ఈ సందర్భంగా నియోజకవర్గ విషయాలపై చర్చించారు.


# వచ్చారు..చూసారు..వెళ్లారు

### తూతూ మంత్రంగా మున్నంగి సీ ఫుడ్స్ ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్డీవో
### కాలుష్యంపై క్షేత్ర స్థాయి పరిశీలనకి ఆదేశించిన జిల్లా కలెక్టర్
### పాలేటిలో కలిసిన కలుషిత ప్రాంతం వదిలి యాజమాన్యం చూపిన ప్రాంతం పరిశీలన



100 యాజమాన్యం చూపించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న....





పాలేరులో మున్నంగి సీ ఫుడ్స్ వేస్ట్ నీరు

(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, జనవరి 3)

పర్యావరణ, భూగర్భ పాలేరు నదీ కాలుష్యం నుంచి కాపాడాలని కోరుతూ వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు మొక్కుబడిగా జరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది . ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం పాలేరు నదీ పరీవాహక ప్రాంతంలో నెలకొల్పిన సీ ఫుడ్స్ నుండి విడుదల చేస్తున్న కర్మాగార వ్యర్థాలను సమీపం లోని పాలేరు నది లోకి వదలడం పై కొంత కాలంగా ప్రజల నుండి నిరసన వ్యక్తం అవుతుంది. క్షేత్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం ఉదాసీనంగా ఉన్నారంటే ప్రభుత్వ చిత్త శుద్దిని వెక్కిరించేదిగా ఉంది. చట్టాలు, అధికారులు మమ్మల్ని ఏవి ఏమీ చేయలేవు మామింతే అన్న చందంగా యంత్రాంగం ఉంది. జిల్లా కలెక్టర్‌కి గ్రీవెన్స్ సెల్‌లో ప్రజలు ఫిర్యాదు పై కలెక్టర్ ఆదేశిస్తే క్షేత్ర స్థాయి లో ప్రత్యక్ష పరిశీలన జరిగిన తీరు విమర్శలకు దారి తీస్తుంది. క్షేత్ర స్థాయి లో పరిశీలనకు వచ్చిన ఒంగోలు ఆర్ డి వో లక్ష్మీ ప్రసన్న వచ్చి మున్నంగి సీఫుడ్ యాజమాన్యం చూపిన ప్రదేశాన్ని పరిశీలించి ఫాక్టరీ నుంచి విడుదలైన పాలేరు నదిని కలుషితం చేసే ప్రదేశాన్ని పట్టించుకోకుండా వెళ్లి పోవడం విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయి పరిశీలన పారదర్శకంగా జరిగి కాలుష్యపు కోరల నుండి పాలేరు నదీ పరీవాహక ప్రాంతాన్ని, ప్రజలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

### హైందవ శంఖారావానికి ముందస్తుగా ఒంగోలులో భారీ బైక్ ర్యాలీ
### కాషాయ పతాకాలతో శంఖారావం గీతాలతో ఉరకలెత్తిన హిందూ బంధుగణం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 5)

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీ ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు సన్నాహకంగా ఒంగోలులో వందలాది హిందూ బంధువులు స్థానిక మంగమూరు రోడ్డు లోని పొలిమేర ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద నుండి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ విజయవంతం చేశారు. ముందుగా హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిచారు. డీజే

# కదం తొక్కిన కాషాయదళం



పాటలతో జైశ్రీరామ్ నినాదాలతో, కాషాయపతాకాలు చేపట్టి రుధిరం ఉప్పొంగేలా త్రిపుర భైరవానంద స్వామి శంఖారావం పూరించగా బైక్ ర్యాలీ ప్రారంభించారు. మంగమూరు మర్రిచెట్టు కాలనీ వద్ద నుండి సాయిబాబా దేవాలయం మీదుగా రాజా పానగల్ రోడ్డు, కోర్టు సెంటర్, కేశవస్వామి పేట, మున్సిపల్ కార్యాలయం మీదుగా సంతపేట, రాంనగర్ రెండవ వీధి, ట్రంకు రోడ్డు చేరి పాత కూరగాయల మార్కెట్, బాపూజీ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో, బైపాస్ రోడ్డు మీదుగా అంజయ్య రోడ్డులోని ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం వద్ద ర్యాలీని ముగించారు. నగరంలోని పలు కూడళ్లలో ఎంతో ఉత్సాహంగా భారీ కాషాయపతాకను చేపట్టిన యువకులు చిందులు వేశారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, నగరంలోని హైందవ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

4

### జిల్లా ఎస్పీ శ్రీ ఏఆర్ దామోదర్
### 4 వ రోజు కొనసాగిన కానిస్టేబుల్ మహిళ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా మహిళ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన జిల్లాలోని అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 5 గంటల నుండి ఒంగోలు పోలీసు కవాతు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు నిర్వహించారు. 4వ రోజు 455 మంది అభ్యర్థులకు గాను 194 మంది హాజరయ్యి పాల్గొనగా, వీరిలో 123 మంది తదుపరి వ్రాత పరీక్ష కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు సూచించిన నియమాల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లుగా పేర్కొన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, చాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు, అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎటువంటి పొర పాట్లకు తావులేకుండా ఆధునిక

# పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ఆర్ఎఫ్ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థుల వెరిఫికేషన కోసం ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలన్నారు. అదేవిధంగా మహిళా అభ్యర్థులకు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వుంటే తప్పకుండా తెలపాలని ఎస్పీ గారు సూచించారు. అభ్యర్థుల కొరకు వైద్య శిబిరం, మంచినీరుతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. పిఈటి ఈవెంట్‌లకు గర్భిణీ స్త్రీలకు మినహాయింపు ఉన్నదని, వారు మినహాయింపు కోసం ఎస్-ఎల్‌పిఆర్‌బి కి మెయిల్ ద్వారా సంబంధిత పత్రాలు పంపాలని తెలిపారు. ప్రతిభ, సామర్థ్యం ఆధారంగానే ఉద్యోగం వస్తుందని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. దళారులు, మధ్యవర్తుల మాటలు





నమ్మిమోసపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉద్యో గం ఇప్పిస్తామని ఎవరైనా మోసపు మాటలు చెప్పినా డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, పిటిసి డిఎస్పీ మాధవ రెడ్డి, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరరావు, పిటిసి డిఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ ఏఓ రామ్మోహన్‌రావు,

4

### బాధ్యత లేని ప్రభుత్వ యంత్రాంగం
### కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరుస్తున్న పాకల గ్రామ పంచాయితీ అధికారులు

(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జరుగుమల్లి, జనవరి 3)

ప్రభుత్వాలలో పారిశుధ్య, స్వచ్ఛ పాకల కార్యక్రమాలకు ఏర్పాటు చేసిన వాహనం ఆ పనికి కాకుండా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు కాంట్రాక్టర్‌కి లబ్ధి చేకూర్చేందుకు ఉపయోగించడం చర్చనీయాంశం అయింది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయితీ గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులు కాంట్రాక్టర్‌కి అప్పగించారు. రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిబంధనలకు భిన్నంగా గ్రామ పంచాయితీ చెత్త తరలించే ట్రాక్టర్‌ని ఉపయోగించుకుని సిమెంట్ తరలించడం ప్రజలలో చర్చ నియాంశమైంది. కాంట్రాక్టర్ తను చేస్తున్న రోడ్డు పనికి ప్రయివేటుగా సిమెంట్ ఇతర సామగ్రిని తోలేందుకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకోవాలి. కానీ సదరు కాంట్రాక్టర్ ఏకంగా గ్రామ పంచాయితీ ట్రాక్టర్‌ని తాను వేస్తున్న కాంట్రాక్టు పనులకు, సిమెంట్ తరలించడం కొరకు ఉపయోగిస్తున్నా గ్రామ పంచాయితీ కార్యదర్శి నాకేమీ తెలియదు అని చెప్పడం ఆయన ఏమేరకు భాధ్యత ఉన్నాడో అర్ధం చేసుకోవచ్చు. రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఉప ముఖ్యమంత్రి పారదర్శకంగా, అవినీతి రహిత పాలన ఇవ్వాలని ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరుగకుండా చర్యలు చేపడుతుంటే ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాల ప్రతినిధి నాయకత్వం గ్రామ ప్రభుత్వ పరిపాలన సాగుతున్న పాకల గ్రామ పంచాయితీలో కాంట్రాక్టర్ గ్రామ పంచాయితీ వాహనాన్ని తన పనులకు ఉపయోగించుకుంటూ దుర్వినియోగం చేస్తున్నా కలెక్టర్ పంచాయితీ గాని, జిల్లా పంచాయితీ అధికారి గాని, గ్రామ పంచాయితీ గాని చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

# రోడ్డు కాంట్రాక్టర్ పనులకు గ్రామ పంచాయితీ చెత్త తరలించే వాహనమా?





4



## పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ఐటి కోర్ సీఐ వి సూర్యనారాయణ, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, మనోహర్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి, మహిళ ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కదం తొక్కిన కాషాయదళం





## వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి

### పట్టణ ఎస్ఐ విజయ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

ఆటోలలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించరాదని, ఆటోలు డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని, ఆటోలలో సౌండ్ బాక్సులు పెట్టరాదని పట్టణ ఎస్సై విజయ్ కుమార్ సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనాల తనిఖీలో భాగంగా బాపట్ల పాత బస్టాండ్ వద్ద పట్టణ ఎస్సై విజయ్ కుమార్ శుక్రవారం వాహన పత్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు వాహన నియమావళిని పాటించాలన్నారు. వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకుంటే కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఆటోలలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించరాదని ఆటో నడిపేటప్పుడు యూనిఫామ్ ధరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డ్రై డే ఫ్రైడే కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తర్వుల ప్రకారం బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని వార్డులలో శుక్రవారం ఉదయం మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి ఆదేశాల ప్రకారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో గృహాల వద్ద పనికిరాని కూలర్ల నందు, తొట్టెల నందు, కొబ్బరి బొండాల నందు నిలిచిన నీటిని సిబ్బంది ద్వారా తొలగించి ద్రావణాన్ని పిచికారి చేశారు. అనంతరం కమిషనర్ ప్రజలతో నేరుగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.ఇంటి పైన గల వాటర్ ట్యాంకుల పై దోమలు జొరబడకుండా మూతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే గా పాటించి డెంగ్యూ లాంటి వ్యాధుల భారి నుండి రక్షణ పొందగలమన్నారు. వార్డుల నందు ప్రతిరోజు ఫాగింగ్ నిర్వహించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ, పురపాలక సంఘ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జీవనోపాధి పథకం అభివృద్ధికి బాటలు వేయాలి

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

మహిళల జీవనోపాధి పెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. వివిధ శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.జీవనోపాధి పథకం అనుసంధానంతో మహిళల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సమర్థంగా చేపట్టాలన్నారు. వారి జీవనోపాధి వృద్ధికి అధికారులు సహకరించాలన్నారు. పాడి గేదెల పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు పాడి గేదెలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గేదెల కొనుగోలు ప్రక్రియ పక్కాగా చేపట్టాల న్నారు. యువతీ, యువకుల ఉద్యోగ నియామకాలకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని డిపిఓ ను ఆదేశించారు. ఆక్వా పార్క్ ప్రతిపాదనలపై సమగ్ర నివేదిక పంపాలని సూచించారు. పి జి ఆర్ ఎస్ లో నమోదయ్యే రెవెన్యూ అంశాల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, డిఆర్డి ఏపిడి పద్మ, డిపిఓ ప్రభాకర్, మత్స్యశాఖ ఇన్చార్జ్ ఏడి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వైద్యసేవతో ఒక్కొక్కరికి 25 లక్షల సేవలు

### చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

### వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభించిన జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 3)

రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఒక్కొక్కరికి రూ.25 లక్షల విలువైన వైద్య సేవలు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా అందులో కవరేజ్ ఉంటుందని తెలిపారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంనేయులు. రాష్ట్రంలో ఏటా 70 వేల కొత్త క్యాన్సర్ కేసులు,40 వేల వరకూ మరణాలు సంభవి స్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకం ఎంతో ఉప యుక్తంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు అన్నివిధాల సాయంగా నిలిచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపుని శుక్రవారం చీఫ్ విప్ జివి ఆంజనేయులు ప్రారంభించారు. నోటి, గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షల కోసం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సులో మాట్లాడిన జీవీ దేశం, రాష్ట్రంలో ఏటా లక్షలమంది క్యాన్సర్‌కు బలవడం బాధాకరం అన్నారు. ఏ క్యాన్సర్ అయినా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయ స్థితి నుండి బయట పడవచ్చని, అందుకే ప్రతి మహిళ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లోనూ ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయాలని ఒమేగా యాజమాన్యం, వైద్యుల్ని కోరారు. త్వరలో రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నారని, దాంతోబాటు ఒమేగా లాంటి ఆసుపత్రి ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనూ క్యాన్సర్ కి నాణ్యమైన వైద్యం, ఔషధాలు అందిస్తున్నారన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రభుత్వ పరంగానూ ప్రోత్సహించాలని, రైతులు కూడా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పండించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా దిగుబడులు తక్కువ వచ్చినా మంచి ధర లభిస్తుందన్నారు.



# సనాతన వాదం పై సమరం సాగించడమే సావిత్రిబాయికి అందించే నివాళి



### ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

సనాతన సాంప్రదాయాలపై సమరం సాగించడమే సావిత్రిబాయి పూలేకి అర్పించే ఘనమైన నివాళి అని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలో చదువుల తల్లి సావిత్రిబాపూలే 194వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా నాయకురాలు కె.రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సుమారు 200 సంవత్సరాల క్రితం సమాజంలో ఉన్న సనాతన సాంప్రదాయాలు, ఆచారాలను ప్రతిఘటించటం సాధారణ విషయం కాదన్నారు. మహిళలు గడప దాటడానికి అవకాశం లేని రోజుల్లో తను చదువుకోవడమే గాక, విద్యాలయాలను స్థాపించి మహిళా విద్యకు సావిత్రిబాయి అంకురార్పణ చేశారని అన్నారు. బాల్య వివాహాలు, అమానుషమైన సతీసహగమనాన్ని నిషేధించాలని ఆమె పోరాటాలు సాగించారని అన్నారు. చిన్న వయసులోనే భర్తలను కోల్పోయిన బాలికలు గుండు గీయించుకుని, అవమానాలు పడుతూ ఉండాల్సిన పరిస్థితి నీ ఆమె నిరసించారని తెలిపారు. వితంతువులకు పునర్వివాహం జరిపించాలని చెప్పటమే గాక దగ్గరుండి అనేకమంది వితంతువులకు పునర్వివాహాలు జరిపించి పునరావాసం కల్పించేందుకు ఆమె కృషి చేశానన్నారు. ఈ సామాజిక చైతన్యాన్ని నాటి సనాతన వాదులు అనేక విధాల అడ్డుకునే ప్రయత్నం చేయటం, దాడులు చేయటం జరిగినా వాటన్నిటిని అధిగమించి తన భర్త జ్యోతిబాపూలే అండదండలతో సావిత్రిబాయి ముందడుగు వేశారని తెలిపారు. అటువంటి మహోనీయుల త్యాగాల ఫలితమే నేడు సమాజంలో మహిళ ఈమాత్రమైనా తల ఎత్తుకొని బ్రతకగలుగుతున్నదని అన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఆటంకాలు అధికమించి అన్ని అవకాశాలను అందుకుంటున్న దశ లో సనాతన వాదం నేడు మరింత పెచ్చరిల్లటం ఆందోళనకరమని అన్నారు. ఆ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా పోరాడటమే సావిత్రిబాయికి అందించే ఘన నివ్వాలని అన్నారు. ఐద్వా ఒంగోలు నగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల మీద దాడులు హింస పెరిగాయని అన్నారు. సమానత్వాన్ని బోధిస్తున్న భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంగా రూపొందించాలని బిజెపి భావించడమే దీనికి కారణం అని అన్నారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం మహిళలు వంటింటికి పరిమితం కావాల్సిన స్థితి ఉన్నదని విద్యా ఉపాధి పరిపాలన లాంటి వారికి మహిళలను దూరం పెట్టి మనుధర్మ శాస్త్రాన్ని, ఆచారాలను మంట కలపాలని అన్నారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు బత్తుల రంగమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్ళు జి కళ్యాణి, ఎస్ ఇంద్రజ్యోతి, పి లక్ష్మి, కె పద్మ, బి ఉష, కే శ్రీలత, ఏ సత్యవతి, కె సీతమ్మ, యన్ కుసుమ, యస్ కె నాగూర్, జి గురువర్ధిని, డి పద్మ, పాల్గొన్నారు.

## కార్పొరేటర్ వేలూరు మహేష్ ఆధ్వర్యంలో భారీగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి అపూర్వ స్వాగతం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)

వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని, నెల్లూరు రాంజీ నగర్ ఆఫీసులో 46 డివిజన్ నగర కార్పొరేటర్ వేలూరు మహేష్ ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు భారీగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు.

# సావిత్రిబాయి పూలే జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా పాటించాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం శుక్రవారం ఒంగోలులోని మంచి పుస్తకం షాపు దగ్గర బీసీ సమన్వయ కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ బోట్ల సుబ్బారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆనాటి సమాజంలో మహిళలు వెనుకబడి పోవడానికి కారణం ఆధునిక విద్య అందకపోవడమేనని గుర్తించి మహిళలకు దళితులకు పాఠశాలలు ఏర్పాటు చేసి విద్య నేర్పించిన తొట్ట తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. బాలిక విద్యను వ్యతిరేకించే మూఢ బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని దిక్కరించి ఎవరూ చేయని సాహసానికి ఒడి కట్టిన పూలే సావిత్రిబాయి పూలే దంపతుల స్ఫూర్తిని తీసుకొని ముందుకు నడవాలని కోరారు. ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దంపతులు 19 48లో సత్యశోధకు సమాజాన్ని స్థాపించి స్త్రీలకు అణగారిన వర్గాలకు పాఠశాలలు స్థాపించి విద్యాబోధనలను నేర్పించిన ఆదర్శ దంపతులని కొనియాడారు. స్త్రీలు బహుజనులు జ్ఞానాన్ని సంపాదించనంత కాలం వారి విముక్తి సాధ్యం కాదని వారి కార్యాచరణ ద్వారా సమాజానికి సాటిన ఆదర్శ దంపతులని అన్నారు. అవమానాలను అవహేళనలను భౌతిక దాడులను ఎదుర్కొని సమాజాన్ని ముందుకు నడిపించడానికి కంకణం కట్టుకున్న ఆధునిక భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమె జన్మదినం జనవరి 3 మహిళా ఉపాధ్యాయ దినంగా పాటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో నేటి మహిళలు చైతన్యవంతలై సమాజాన్ని పురోగమన వైపు నడిపించడమే సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు టి.వెంకటస్వామి, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్ రావు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు దుడ్డు వెంకటరావు,ఎం జార్జి, ఐ ఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, యానాది సంఘం నాయకులు డాక్టర్ ఈగ శ్రీనివాసరావు, మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ నాయకులు నాగేశ్వరరావు, బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు కేవీ శేషమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు తోరటి ఆనంద్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరం సత్యం, డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు, బీసీ సమన్వయ కమిటీ నాయకులు మూట భాస్కర్, పి శ్రీనివాస్, మోటుపల్లి బాబు, ఫణిదనపు సుధాకర్, కే పెద్దన్న, కుబోయిన కోటి, కుట్టు పోయిన సురేష్, యాదవ సంఘం నాయకులు డి అప్పారావు, రచయిత పిన్నికి శ్రీనివాస్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కే పేరయ్య, ప్రజాస్వామ్యకవాదులు లింగ వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నాయకులు ఎన్ వీరాంజనేయులు, ఇత్తడి రవికుమార్, న్యాయవాది పరిటాల పిచ్చియ్య తదితర సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జోహార్ సావిత్రిబాయి పూలే, పోరాడుదాం అందరికీ విద్య ఉపాధికై, పోరాడుదాం అసమానతలకు కుల వివక్షతకు వ్యతిరేకంగా అంటూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమం తదంతరం ఒంగోలులోనే ఎలక్ట్రిసిటీ ఆఫీసు వద్ద ఉన్న పూలే, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు.



## బంగారు బాల్యం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 3)

పొదిలి ఒకటో సచివాలయం పరిధిలోని కేజీబీవీ స్కూల్లో బంగారు బాల్యం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కులు, వారి పరిరక్షణకు ఉన్న చట్టాలు, పెళ్ళి వయస్సు, బాల కార్మికలు లేకుండా ఇలా అనేక రకాలుగా పిల్లలకు బంగారు బాల్యం గురించి అవగాహన కల్పించారు. "బంగారు బాల్యం భవితికు సోపానం" అనే నినాదాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ హెచ్ఎం టిఎం అనురాధ, పొదిలి సచవాలయం 1 అడ్మిన్ అశోక్‌రెడ్డి, ఏఎన్ఎం కె విజయ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ, మహిళా పోలీస్ టి కుసుమ, అంగన్‌వాడీ టీచర్స్, ఆశాలు, స్కూలు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 5న జిల్లాస్థాయి సెపక్తక్రా ఎంపిక పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

జిల్లా సపక్ తక్రాసంఘం ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ పి ఆనంద్ డీఎస్ఏ మినీ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు జూనియర్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం అధ్యక్షులు యనమల సురేష్ తెలిపారు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లు ఎంపిక చేసి ఈ నెల 17, 18 తేదీల్లో పొదిలి మండలం ప్రకాశం జిల్లాలో జరుగుతున్న 28వ జూనియర్ రాష్ట్రస్థాయి సపక్ తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు వారి యొక్క వయసు 01-01-2005 సంవత్సరం జన్మించి ఉండాలి క్రీడాకారుల వెంట తీసుకురావాల్సినవి వయోపరిమితి సర్టిఫికెట్ మరి ఆధార్ కార్డు పాస్పోర్ట్ ఫోటో తీసుకురావాలన్నారు. సంప్రదించవలసిన నెంబరు 8309114074.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చీమకుర్తికి చెందిన బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు, ఓబుల్, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్, పీడీ కె వనజ పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుకు 27 అర్జీలు





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జనవరి 3)

మండలంలోని ముప్పాళ్లపాడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 27 అర్జీలు అందాయి. ఆన్‌లైన్‌కు 11, జాయింట్ ఎల్‌పీఎం విభజనకు 8, వేరే వారు ఆన్లైన్ చేసుకొనుట తొలగించుట గురించి 3, స్మశానం కొరకు 1, 22 ఏ నుంచి తొలగించుటకు 3, కొరిలేషన్ పొరపాటు 1 వెరసి 27 అర్జీలు వచ్చాయి. గ్రామ సభకు తహసీల్దార్ దిలీప్ కుమార్ మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య గ్రామ రెవిన్యూ అధికారి బెంజిమెన్ గ్రామ సర్వే అధికారి శ్రీనివాసరెడ్డి దేవాదాయ శాఖ ఈవో శంకర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎస్ తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, కోటపాటి శేషయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు దిరిసనం హనుమరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెండింగ్ రెవెన్యూ, భూ సమస్యల్ని పరిష్కరించాలి

### మంగళగిరిలో ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సులో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 3)




వినుకొండ నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ, భూ సమస్యలు వేగంగా పరిష్కరించాలని మంత్రి అనగాని, సీసీఎల్ఏకు విజ్ఞప్తి చేశారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అగ్రహారం భూములకు పట్టాలు, డీఫారెస్ట్ - భూములకు హద్దులు నిర్ణయం, పట్టాలు, భూ కబ్జాదారులపై దర్యాప్తు చేసి చర్యలు సహా అన్ని రెవిన్యూ సమస్యలను ఒక కొలిక్కి తీసుకుని రావాలని కోరారు. అందుకు సంబంధించి కొంతకాలంగా వినుకొండ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో, తన దృష్టికి వచ్చిన సమస్యలపై జీవీ ఆంజనేయులు మంత్రి అనగాని, సిసోదియా దృష్టికి తీసుకెళ్లారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో శుక్రవారం ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా, సీసీఎల్ఏ ఛైర్మన్ జయలక్ష్మి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జోన్ 3 జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం, ప్రజల సంతృప్తి, పెండింగ్ అంశాలతో పాటు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వినుకొండకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన వినతిపత్రాన్ని జీవీ మంత్రి, అధికారులకు అందించారు. బొల్లాపల్లి, ఈపూరు, నూజెండ్ల, వినుకొండ మండలాల్లోని గుమ్మనపాడు, అంగలూరు, తిమ్మాపురం, వీ అప్పాపురం, కొండ్రప్రోలు, శివాపురం, నాగులవరం అగ్రహారం భూముల విషయంలో రైతులు సాగు చేసుకుంటున్నా పట్టాల్లేక ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన సర్వే, గెజెట్ ప్రచురణ, గ్రామాల హద్దుల నిర్ణయం, రికార్డుల్లో మార్పులు, ల్యాండ్ పార్సిల్ మాప్‌లు అన్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలానే నూజెండ్ల, ఈపూరు మండలాల్లోని ముర్తిజాపురం, పమిడిపాడు, గుండెపల్లి గ్రామాల్లో డీఫారెస్ట్ భూముల హద్దుల నిర్ణయం, పట్టాల పంపిణీ వేగంగా చేపట్టాలన్నారు. 1975 నుంచి అపరిష్కృతంగా ఉన్న ఈ భూముల విషయంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కొర్రీలు, వాగు పోరంబోకుగా పేర్కొనడం వంటి అంశాలు సరి చేయాలని కోరారు. ఇదే సమయంలో వినుకొండ మండలం తిమ్మాయపాలెం, వెంకుపాలెం, జాలలపాలెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భారీ ఎత్తున భూ అక్రమాలు చేశారని, నాడు ఎమ్మెల్యే గా అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూములు చెరబట్టారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, అతడి అనుచరులు సాగుదార్లను 22ఏ పేరు బెదిరించి 152 ఎకరాలకు పైగా భూములు లాక్కున్నారని తెలిపారు. వీటితో పాటు అటవీ, ప్రభుత్వ భూములు ఆక్రమించారని, వాటన్నింటిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవడంతో పాటు భూములు రికవరీ చేయాలని కోరారు . అలానే నియోజకవర్గం వ్యాప్తంగా అభ్యంతరాల్లేని భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించా లని విజ్ఞప్తి చేశారు. మిగులుభూములు గుర్తించి డీకే పట్టాల ద్వారా భూమి లేని పేదలకు అందిం చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రెవిన్యూ గ్రామాల్లో సమగ్ర రీ సర్వే నిర్వహించడం ద్వారా భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. వీటన్నింటి కోసం కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దా ర్ కార్యాలయాల వరకు ఉన్న ఖాళీలు భర్తీ చేయాలని, పేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలాల పంపిణీకి కూడా చర్యలు తీసుకోవాలని మంత్రి అనగానికి సమర్పించిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు.




## ఒంగోలు భూ కబ్జాల పై చర్యలు చేపట్టాలి

### సిసిఎల్ఏ సమీక్షలో ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , స్టాంప్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ప్రాంతీయ రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి సమీక్ష సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన భూ కుంభకోణంపై సమగ్ర రిపోర్ట్, ఎస్ఐటీలో వచ్చిన అర్జీల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన, 22 ఏ భూముల అక్రమాలు,ఇతర రెవెన్యూ, భూ సంబంధ సమస్యలు తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఒంగోలు లో గ్రత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఫేక్ పట్టాలు పైన లోత్తిన విచారణ జరిపించాలన్నారు. ఒంగోలులో జరిగిన జరిగిన భూ కుంభకోణం పైన ఏర్పాటు చేసిన ఎస్ఐటీ రిపోర్ట్ పైన ప్రస్థావించగా, రెవిన్యూ మినిస్టర్, ఆర్‌పీ సిసోడియా , జిల్లా కలెక్టర్‌కి దేని పైన డిటైల్ రిపోర్ట్ అడగటం జరిగింది. ఒంగోలులో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రెవెన్యూ రికార్డ్స్ టాంపరింగ్ పైన ఫోరెన్సిక్ ఆడిట్ కోరటం జరిగింది. సుజాత నగర్ ఎండోమెంట్ ల్యాండ్ గురించి ప్రస్థావించి నివాసితులకు న్యాయం చేయాలని కోరారు.

# సావిత్రిబాయి చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలి

### సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

### దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రని పాఠ్యాంశంగా పెట్టాలని, ఆమె జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 195 జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు అన్నారు. తన భర్త జ్యోతిరావు పూలేతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. సావిత్రిబాయి పూలే 1831 జనవరి 3న ప్రస్తుతం మహారాష్ట్రలోని సతారా జిల్లా నైగాన్ లో జన్మించారన్నారు. 1873లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్'ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహాల కొరకు అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారన్నారు. సావిత్రిబాయి పూలే జ్యోతిరావు పూలే అంబేద్కర్ వంటి సంఘ సంస్కర్తల మార్గదర్శకంలో దళిత బహుజనులు విద్యావంతులై, సామాజిక చైతన్యంతో రాజ్యాధికార దిశగా అడుగులు వేయటాన్ని, అగ్రకులాలు జీర్ణించుకోలేక అనేక కుట్రలు చేస్తున్నాయన్నారు. ప్రతికూలతలను దాటి ఐక్యంగా ఉన్న దళితులను వేరు చేసేందుకు వర్గీకరణను ముందుకు తెచ్చారన్నారు. దళితులను బలహీనపరిచేందుకు అనేక ప్రతికూల పరిస్థితులను ఏర్పరుస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలున్నా, బోధించే ఉపాధ్యాయులు లేరన్నారు. పాఠశాలల్లో బోధన ఉపకరణాలుండవన్నారు. రిజర్వేషన్లు ఉంటాయి కానీ నోటిఫికేషన్లు ఉండవన్నారు. సబ్ ప్లాన్లు ఉన్నా, కేటాయింపులు చూపిస్తున్నా ఆచరణ ఉండదన్నారు. కార్పొరేషన్లున్నా, వాటికి నిధులు కేటాయించారన్నారు. బడ్జెట్లో చూపించే నిధులను ఇతరుల కోసం దారి మళ్ళిస్తారన్నారు.నాలుగేళ్లుగా సెన్సెస్ ప్రక్రియ ప్రారంభించకపోయినా ఎస్సీ ఎస్టీ బీసీ ఎమ్మెల్యేలు ఎంపీలను, కనీసం కుల గణన కోసం పార్లమెంటులో శాసనసభలో మాట్లాడలేని దయనీయ పరిస్థితికి తెచ్చారన్నారు. తమ హక్కుల్ని సాధించుకోవటం కోసం ఎస్సీ ఎస్టీలు ప్రశ్నించాలన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు కాకుమాను రవి, కసుకుర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.



# అగ్రహారం భూములలో లబ్ధిదారులకు పొజిషన్ చూపాలి



**అనర్హత పేరుతో కొత్త లబ్ధిదారుల లిస్టు తయారు చేస్తామంటే కుదరదు**

**22 వేల మంది లబ్ధిదారులకు రెండు సెంట్లు వంతున నివేశిత స్థలం ఇవ్వాలి**

**ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల వంతున లబ్ధిదారునికి ఇవ్వాలి**

**లబ్ధిదారుల పక్షాన మాజీ మంత్రి బాలినేని పోరాడాలి**

**ఈ నెల 10న లబ్ధిదారులతో, పేదలతో కలిసి**

**సిపిఐ నివేశిత స్థలాల కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**

రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గత ఎన్నికల సమయంలో అత్యధికంగా ఒంగోలు నగరంలోని పేదలకు ఇచ్చిన భూములకు పొజిషన్ చూపించాలని, అలాగే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలవంతుల లబ్ధిదారునికి నిధులు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో ఒంగోలులోని పేదలకు అగ్రహారం వద్ద ఇచ్చిన భూములను సిపిఐ ప్రకాశం జిల్లా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తా నని హామీ ఇచ్చానని, హామీకి అనుగుణంగా నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేయాలని, లేనిపక్షంలో తాను ఎన్నికలలో పోటీ చేయనని పేర్కొన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి రూ. 200 కోట్లు నిధులు మంజూరు చేయించుకోవడమే కాకుండా అగ్రహారం వద్ద ఎకరా రూ. 35 లక్షల వంతున 280 ఎకరాలను భూమి కొనుగోలు చేశారన్నారు. ఒక్కొక్కరికి సెంటు చొప్పున 22 వేల మందికి అర్హత పత్రాలు కూడా అందించినట్టు భారీగా ప్రచారం చేసుకున్నారన్నారు. అయితే ఆ భూములలో ఇప్పటివరకు ఒక్క నిర్మాణం కూడా జరగలేదన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అనర్హులు ఉన్నారని నెపంతో లబ్ధిదారుల లిస్టును రద్దు చేసి దాని స్థానంలో కొత్తగా లబ్ధిదారుల లిస్టు తయారు చేసేందుకు సమాయత్తం కావడం దుర్మార్గమన్నారు. అనర్హులు ఉంటే వారి వరికే తొలగించాలని, లబ్ది దార్ల పూర్తి జాబితాను తొలగించటం పద్ధతి కాదని హితవు పలికారు. ప్రభుత్వాలు మారి, రాజకీయాలు మారిన పరిణామాలకు పేదలను బలి చేయటం సబబు కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలోని అత్యధిక ఇళ్ల స్థలాల పంచిన అగ్రహారం భూములలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఒక్కొక్కరికి రెండు సెంట్లు వంతున భూమి ఇవ్వడంతో పాటుగా, ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షల వంతున నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణాలలో ఒంగోలును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో లబ్ధిదారులు, పేదలతో కలిసి ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పాతి, సిపిఐ పంపిణీ చేస్తుందని హెచ్చరించారు. లబ్ధిదారులకు సిపిఐ అండగా నిలుస్తుంది అన్నారు. నివేశిత స్థలాల కోసం ఈనెల 10వ తేదీన ఒంగోలు కలెక్టరేట్ వద్ద లబ్ధిదారులతోపాటు, పేదలతో కలిసి ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ లబ్ధిదారులకు భూమి దక్కేవరకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి లబ్ధిదారుల పక్షాన పోరాడాలి అన్నారు. లేని పక్షంలో ప్రభుత్వంతోపాటు, బాలినేనికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈపాటికె ఒంగోలు నగరంలో నివేశిత స్థలాల కోసం పేదలు సంవత్సరాలు తరబడి ఎదురు చూస్తున్నారన్నారు. పెరిగిన ధరలతో,



పిల్లలకు చదువులు చెప్పించలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే అగ్రహారం భూములలో లబ్ధిదారులకు పొజిషన్ చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద లబ్ధిదారులతో పేదలతో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, వి హనుమారెడ్డి, కె వీరారెడ్డి, నల్లూరి మురళి,ఆర్ రామకృష్ణ, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, నాయకులు యంఏ సలార్, ఉప్పుటూరి ప్రకాష్ రావు, డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం వెంకయ్య, ముత్తని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



## మార్కాపురంలో స్కూల్ బస్సు బీభత్సం ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, జనవరి 3)**

మార్కాపురం పెద్దనాగులవరం రోడ్డులోని మీనా మసీదు వద్ద వేగంతో వెనక్కి రివర్స్ చేస్తూ మూడు బైకులను శు క్రవారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా.. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సును, బస్సులో ఉన్న విద్యార్థులను అక్కడే వదిలేసి, బస్సు డ్రైవర్ పరారైనట్లు స్థానికులు తెలిపారు.

## ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**



మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు. చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 17 రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తే పారిశుద్ధ్య కార్మికులకు, హెల్త్ అలివేన్స్ని వేతనంతో కలుపుతూ జీవో ఇచ్చారు.. కానీ ఇంజనీరింగ్ కార్మికులు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కనీస వేతనాలు అమలు చేయలేదన్నారు. అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు, 9 మంది ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి. ఆ రిపోర్టును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.. క్యాటగిరి వారీగా ఎవరికి ఎంత వేతనం ఉండాలి అనే విషయాన్ని ఆ కమిటీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేవని గత వైసిపి ఇది ప్రభుత్వం దూసలాడింది. ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఉన్న ఫైళ్లను.. జీవో రూపంలో ఇవ్వటంలో మొండిగా వ్యవహరించింది. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం యూనియన్ రాష్ట్ర నాయకత్వం మంత్రుల్ని ముఖ్యమంత్రిని అధికారుల్ని ఈ ఆరు మాసాల కాలంలో అనేకసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. మాకు టైం ఇవ్వండి అని మున్సిపల్ శాఖ మంత్రి ఏడు నెలలు గడిపాడు పెద్దపెద్ద కాంట్రాక్టర్లకు క్షణాల్లో పనులు చేసే ఈ మంత్రులు. కొత్త ప్రభుత్వం వచ్చింది కార్మికులకు కొంత వేతనాలు పెరుగుతాయనే ఆశను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో పర్మినెంట్ ఉద్యోగి,ఒక వేతనం ఆప్కాస్ ఉద్యోగి ఒక వేతనం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనం డైలీ వెజి కార్మికులకు ఒక వేతనం ఇలా రకరకాల వేతనాలతో ఇంజనీరింగ్ కార్మికులు కనీస వేతనాలు అమలు చేయకుండా ఆ ప్రభుత్వం ఈ ప్రభుత్వం మోసం చేస్తున్నారు. అందుకనే ఇంజనీరింగ్ కార్మికులు ఓపిక నశించి. ఈ కొత్త సంవత్సరంలో పోరాటానికి సన్నద్ధమయ్యారు. వెంటనే ప్రభుత్వాలు ఆలోచించి జీవో నెంబర్ 36 ప్రకారం 21 వేల కనీస వేతనం ఇవ్వాలని రిస్క్ అలివేన్స్ ఇవ్వాలని పార్కులో పనిచేసే కార్మికులకు కూడా పారిశుద్ధ్య వేతనం కార్మికుల ఇవ్వాలని వర్క్ ఇన్స్పెక్టర్లకు కంప్యూటర్ ఆపరేటర్ వేతనాల పెంచాలని, స్కిల్ సెమిస్కిల్ వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యల కోసం రాబోయే రోజుల్లో కార్మికులందున ఐక్యం చేసి కొత్త సంవత్సరంలో మరో పోరాటానికి సన్నద్ధమవుతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి. టీ విజయమ్మ, కే. వెంకట్రావు, జాలయ్య. శ్రీదేవి, శివమ్మ,రమేష్, నరసింహ, ఇంజనీరింగ్ కార్మికులందరూ పాల్గొన్నారు.

# మహిళల పాలిట చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య**

**సిపిఐ కార్యాలయంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**

దేశంలో మహిళలకు చదువు చెప్పి, చైతన్యవంతం చేయటంలో సావిత్రిబాయి పూలే ముందు వరుసలో ఉంటారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఒంగోలులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఈశ్వరయ్య మాట్లాడుతూ భర్త జ్యోతిరావు పూలే సహకారంతో దేశంలోని మహిళలకు, అణగారిన వర్గాల ప్రజలకు విద్య ద్వారా చైతన్య పరిచిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. సావిత్రిబాయి పూలే కేవలం విద్యకే పరిమితం కాకుండా దేశంలో నెలకొని ఉన్న మూఢనమ్మకాలను, చాందసవాదాలను, సనాతన ధర్మ వాదాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఎన్నో అవమానాలు ఎదురైన్నప్పటికీ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పోరాడిన మహిళా మూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శనీయమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చరిత్ర ప్రతి ఒక్కరు తెలుసుకోవటమే కాకుండా ఆమె చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలి అన్నారు. సతీ సహగమనాలను పోరాటమే కాకుండా , ఒంటరి మహిళలకు పెళ్లిళ్లు చేసి ఆదర్శవంతంగా నిలిచారన్నారు.దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ చరిత్రలో ఎవరు తెలిపిన చెరిగిపోదని, సావిత్రిబాయి పూలే సేవలను, వీరోచిత పోరాటాలను ప్రజలు గుర్తించారని, అందుకే నేడు దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాల్లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జనవరి 3వ తేదీన నిర్వహించాలని ప్రకటించటం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. జాతీయస్థాయిలో జనవరి మూడో తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావ్, కె. వీరారెడ్డి, వి హనుమారెడ్డి, ఆర్ రామకృష్ణ, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్ డి సలార్, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ ఇవ్వాలి

**చాపల వెంకటేశ్వర్లు**



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జనవరి 3)**

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్మికులు నాయుడుపేట మున్సిపాలిటీ కమిషనర్ ఎస్కె ఫజులుల్లా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు పలు సమస్యలపై కమిషనర్ ను అభ్యర్థించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న వేతనాలు, హెల్త్ అలవెన్సు 12,000, సబ్బులు నూనెలు ,బట్టలు ఇవ్వాలని, గట్టి ఇల్లు స్థలాలు ఇవ్వాలని కోరారు అనంతరం కమిషనర్ ఎస్.కె పజులుల్లా సమస్యలన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. పండుగ అలవెన్స్ వెయ్యి రూపాయలు సహజ మరణం కింద కార్మికులు కుటుంబానికి నష్టపరిహారం 2 లక్షల రూపాయలు చొప్పున ఇవ్వాలని కౌన్సిల్ తీర్మానం చేశామని, మిగిలిన సమస్యలన్నీ కూడా త్వరగా పరిష్కారం చేస్తామని కమిషనర్ కార్మికులకి హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది హరిబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు హరికృష్ణ, మధు, మణి, నవీన్, శ్యామలమ్మ, ఆరవలి, రమణమ్మ ,మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## బంగారు బాల్యం పై కమిటీ సమావేశం





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 3)**

కమిటీలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి బంగారు బాల్యం కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేయాలని సర్పంచ్ దమ్ము వెంకటయ్య కోరారు. ఎరువారిపల్లి సచివాలయం కార్యాలయంలో బంగారు బాల్యం కమిటి కన్వీనర్, పంచాయతీ కార్యదర్శి వి.రవి కుమార్ అధ్యక్షతన బంగారు బాల్యం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పనిచేసి డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని, ఇమ్మ్యునైజేషన్,హెల్త్ చెకప్ సమయంలో ఐసీడీఎస్, హెల్త్ శాఖ సమన్వంతో పని చేయ్యాలని,బాల్య వివాహాలపై అవగాహన కలిగించాలని, బాల కార్మిక వ్యవస్థపై దృష్టి సారించి బాలలంతా బడికి వెళ్ళే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, తప్పనిసరి వివాహ నమోదు చట్టంపై అవగాహన కలిగించి గ్రామంలో జరుగు వివాహలను నమోదు చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో బంగారు బాల్యం కమిటీ సభ్యులు మహిళ పోలీస్ వి సుస్మిత, ఎఎన్ఎం ఎం శ్రావణి, వీఓఏ అనూష, ఉపాధ్యాయుడు గురు ప్రసాద్,పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ యం రమేష్ బాబు, అంగన్వాడీ టీచర్ శ్రీదేవి, కుమారి, దేవమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరిలో కులగణన జాబితా పరిశీలన





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 3)**

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి రావినూతల కోటయ్య కనిగిరి మండల టౌన్ అధ్యక్షులు మాసిపోగు బాబు బాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు కనిగిరి నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగస్తుల జాబితాను ఎంపీడీవో ఆఫీస్ నందు, సిడిపిఓ ఆఫీస్ నందు ఆర్టీసీ ఉద్యోగస్తులు, కనిగిరి నియోజకవర్గం ఎంఈఎఫ్ ఉద్యోగస్తులు ఎంతమంది ఉన్నారు. వారి కులగణన జాబితాను పరిశీలించడం జరిగింది. ఇందులో ముఖ్య అతిథులుగా బాలసాని కోటయ్య మాదిగ ,బలసాని తిరుపాల్ మాదిగ, తిమోతి మాదిగ, గోచిపాతల సుమన్ మాదిగ, దాసరి బాబురావు మాదిగ, ఇంటూరి కిరణ్ మాదిగ, మట్టెమల్ల ఏసుదాస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 3)

డైరీ, క్యాలెండర్లను పొదిలి ఎస్‌టిఓ బి చంద్రశేఖరరావు శుక్రవారం వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరీ చాలా అందంగా అన్ని విధాల పెన్షనర్లకు ఉపయోగపడేలా రూపొందించారని అన్నారు. పెన్షనర్లు అందరూ తమ లైఫ్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు ఈ కార్యాలయంలో ఫేస్ ఆర్ డి యాప్, ఐరిష్,, బయోమెట్రిక్ సౌకర్యాలు ఉన్నాయని, పెన్షన్దారులందరూ ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఏ బాదుల్ల, షేక్ మదార్ వలి, నాయకులు ఏ వీరారెడ్డి, చిట్యం శెట్టి సుబ్బారావు, కేజే మోహన్‌రావు, గోవిందయ్య, డిఎల్ నరసింహం, మూసా జానీ, శ్రీధర్, బిఆర్‌కే శర్మ, ఆశ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీఆర్ బాండ్లపై కీలక ఆదేశాలు

### జారీ చేసిన మంత్రి నారాయణ





(షణ్ముఖ వెలుగు, అమరావతి, జనవరి 3)

టీడీఆర్ బాండ్లపై కీలక ఆదేశాలు మంత్రి నారాయణ జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు,యూడీఏల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ రాత్రి లోగా వెరిఫికేషన్ పూర్తయి పెండింగ్ లో ఉన్న అన్ని బాండ్లను లబ్దిదారులకు అందించాలని ఆదేశాలు. ఆన్‌లైన్‌లో బాండ్లను జారీ చేయాలని మంత్రి ఆదేశాలు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా వచ్చిన టీడీఆర్ దరఖాస్తులను రెండు రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు. గత ప్రభుత్వంలో పలు మున్సిపాల్టీల్లో టీడీఆర్ బాండ్లలో భారీ అక్రమాలు. అక్రమాలు జరిగిన చోట కమిటీలు వేసి సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వం. గత ప్రభుత్వంలో అవకతవకలు జరిగిన బాండ్ల విషయంలో మినహా మిగతా బాండ్లను రిలీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

## ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా సావిత్రిభాయి పూలే జయంతి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 3)

మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎమ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే 194 వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో మొదట ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు, అధ్యాపకులు గారపాటి గోపీ చంద్ ప్రకాష్, జ్యోతి, రఫి, గంగాభవాని, హనుమంతరావు, సుబ్బాచారి, శ్రీనివాసులు, సుభాషిణి, మాధవరెడ్డి, మల్లికార్జున, వెంకటేశ్వర్లు సావిత్రిభాయి పూలే, జ్యోతీరావు పూలే బాలికల విద్యకోసం చేసిన సేవలను విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. అనంతరం మహిళా అధ్యాపకులు, మహిళా అధ్యపకేతర సిబ్బందిని ప్రిన్సిపాల్ గారి ఆధ్వర్యంలో అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ బైపీసీ విద్యార్థిని సిరి సావిత్రిభాయి పూలే వస్త్రధారణ చేయటంతో సిబ్బంది అందరూ అభినందించారు.

# అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

## ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 3)

విద్యార్థులు తలచుకుంటే ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని, అటువంటి వాటికి నాంది పలికి అంతర్జాతీయ శాస్త్రవేత్తలుగా జిల్లా విద్యార్థులు ఎదగాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అభిలాషించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సదరన్ ఇండియా సైన్స్ ఫెస్ట్ లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో ఉండే ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని, విద్యార్థులను ఇంజినీర్లుగా, వైద్యులుగా, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని, ఉపాద్యాయులను కోరారు. ప్రపంచంలోని ప్రతీది సైన్స్ పైనే ఆధారపడి ఉందని, అరచేతిలో ప్రపంచవ్యాప్త సమాచారం మన ముందున్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని తెలిపారు. జిల్లాలో ఇంకా మూఢనమ్మకాలు ఉన్నాయని, వాటిని విడనాడి విజ్ఞానాన్ని నమ్ముకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మన ఇంజినీర్లు, వైద్యులు ప్రపంచ దశా దిశనే మారుస్తున్నారని, ఆ దిశగా జిల్లా విద్యార్థులు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే తరాలు వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాకు దోహదపడాలని, దేశానికి జిల్లా విద్యార్థులు అంబాసిడర్లుగాను, సైంటిస్టులు గాను ఎదిగి మార్స్ నే జయించాలని కోరారు. పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు, అలాగే ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోగలిగితే శాస్త్రవేత్తల్లో కూడా మన జిల్లా ప్రథమ స్థానంలో





నిలవడం సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా కొత్తదనం తెలుసుకొని, మీలోని ప్రతిభా పాఠవాలను వెలికితీయాలని అన్నారు. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదని, మీలో ఉన్న ప్రతిభకు మీరే కారకులన్న సంగతిని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని,




మీరు చేసే అద్భుతాలే ప్రపంచస్థాయిలో గుర్తింపునిస్తాయని తెలిపారు., ఇటువంటి ప్రదర్శనల ద్వారా మరింత ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా నుండి మొత్తం 25 మండలాల నుండి 175 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో పాల్గొని మొత్తంగా 75 ప్రాజెక్టులను ఏర్పాటుచేసి సులభతరంగా వివరించారు. జిల్లాలో ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించిన ఆయన అనంతరం ఆవరణలో ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి, వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ పురుషోత్తం,ఉప విద్యాశాఖ అధికారులు ఎ.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారులు డి ప్రసాదరావు, నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, సైన్స్ కో ఆర్డినేటర్లు ఎ శ్రీనివాసరావు, పవని భాను చంద్ర, వై వై రావు, సికిందర్ మీర్జాన్ వివిధ మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, జనసేన కర్లపాలెం అద్యక్షుడు శ్రీకృష్ణ, కారుమూరి అంజనేష్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే సైన్సు పట్ల ఆసక్తి పెంచుకోవాలి

### శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే భారతదేశ అభివృద్ధి
### జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
### ఘనంగా జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)

విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం నగరంలోని స్టోన్ హౌస్ పేటలోని ఆర్ ఎస్ ఆర్ మున్సిపల్ హైస్కూల్లో జిల్లాస్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డిఇవో బాలాజీరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే భారతదేశ అభివృద్ధి సాధ్యమని, అగ్రదేశాల సరసన భారత్ ముందంజ నిలిచేందుకు సైన్సు పరిశోధనలే కీలకంగా ఆమె చెప్పారు. నేడు మానవజాతి అనుభవిస్తున్న అత్యాధునిక సౌకర్యాలన్నీ విజ్ఞాన శాస్త్ర ఫలాలే అని ఆమె సైన్సు గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులందరూ భావి భారత శాస్త్రవేత్తలుగా రాణించేందుకు, వారి ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు ఎంతో అవసరమన్న ఆమె, ప్రతిఒక్క విద్యార్థి కూడా ఈ విజ్ఞాన ప్రదర్శనలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రకృతిలోని విషయాలను పరిశీలించడం, ప్రయోగాలు చేయడం, ఫలితాలు రాబట్టడం వంటి సైన్సు సంబంధిత అంశాల పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. డిఇవో బాలాజీరావు మాట్లాడుతూ పరిశోధనల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకుని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. జిల్లావ్యాప్తంగా 38 మండలాల నుంచి 114 ప్రదర్శనలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారని, వీటిలో ఆరు ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని డిఇవో చెప్పారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్సు ప్రదర్శనలను అతిథులు తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, జిల్లా సైన్సు సెంటర్ ఇన్‌చార్జి కరుణాకర్ రెడ్డి, హెచ్ఎం మధుసూదన్, విక్రమ సింహపురి యూనివర్సిటీ

# భారతీయ స్త్రీ వాదానికి తల్లి సావిత్రిబాయి పూలే

## జనసేన నాయకులు గునుకుల కిషోర్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)

భారతీయ స్త్రీ వాదానికి తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనసేన పార్టీ తరపున ఘన నివాళులర్పిస్తూ వివక్ష, అసమానతలను తొలగించేందుకు వారు చేసిన అవిశ్రాంత కృషిని ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిద్దామని జనసేన నాయకులు గునుకుల కిషోర్ అన్నారు. "మీరు ఒక పురుషునికి విద్యనందిస్తే, మీరు ఒక వ్యక్తికి విద్యను అందిస్తారు. కానీ మీరు ఒక స్త్రీకి విద్యనందిస్తే, మీరు మొత్తం కుటుంబానికి, చివరికి ఒక దేశానికి విద్యను అందిస్తారు." అంటూ అలుపెరగని పోరాటం చేసిన కీ.శే.సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నెల్లూరు సిటీ మినీ బైపాస్ నందు గల జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకి జనసేన నాయకులు మాలలు వేసి ఘన నివాళులర్పించారు. లింగ ఆధారిత వివక్షను రూపు మాపేందుకు, బాల్య వివాహాల నిర్మూలనకు,వితంతు పునర్వివాహాలకు, అంటరానితనం నిర్మూలించేందుకు ముఖ్యంగా స్త్రీలు విద్యను అభ్యసించాల్సిన అవసరతను, ఆవశ్యకతను గూర్చి విస్తృత ప్రచారం చేశారు. సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే వివాహ అనంతరం సాగిన వారి ప్రయాణం స్త్రీలు బయటకు రావాలంటే భయపడే రోజుల్లోనే స్త్రీలకు విద్య నేర్పించాలని దృఢ సంకల్పంతో బాలికలకు మొట్ట మొదటిగా స్కూల్ ఏర్పాటు చేయడమే కాక భారతదేశ మొదటి మహిళా టీచర్ గా ఆధునిక విద్యకు తల్లిగా సావిత్రిబాయి పూలే గుర్తుండిపోతుందన్నారు. డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మహిళలను ఉద్దేశించి వచ్చే సంపాదనబట్టి ఆర్థికంగా ఇంటిల్లపాది చక్క దిద్దగల మహిళలు రాజకీయాల్లోకి వస్తే వ్యవస్థను మార్చే అవకాశం ఉందని 33% రిజర్వేషన్ మహిళలకు వర్తింపజేయాలని గత పది సంవత్సరాలుగా పవన్ కళ్యాణ్ గారు చెప్పినట్లుగా మహిళా సాధికార కోసం అందరం కలిసికట్టుగా పోరాడుతామన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినా కూడా ఇంకా బాల్యవివాహాలు నెల్లూరు సిటీ పరిధిలో కూడా జరుగుతున్నాయి. కొన్నిప్రాంతాల్లో 13 సంవత్సరాల కే బాలికలకు పెళ్లి చేయడం 26 వయసుకే వాళ్ళు అమ్మమ్మ లగా శారీరక మానసిక దృఢత్వాన్ని కోల్పోయి వ్యాదులకు గురి అవుతున్నారని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకనుగునంగా నెల్లూరు జిల్లాలో కూడా మహిళా నాయకుల రావటం హర్షనీయమన్నారు. నెల్లూరు జిల్లాలో మొట్టమొదటి కోవూరు మహిళా ఎమ్మెల్యే ప్రశాంతి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ప్రజలందరితో వారి కష్ట, నష్టాలను పాలుపంచుకుంటూ ముందుకు నడుస్తున్నారన్నారు. ఇటువంటి గొప్ప వ్యక్తుల సహకారంతో ఇప్పటికీ జరుగుతున్న బాల్యవివాహాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు. మా కుటుంబాల్లో, మా చుట్టుపక్క పరిధిలో బాల్యవివాహాలు జరిగినట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, మహిళల సాధికారత సాధనకు ప్రతి ఒక్కరు ప్రమాణం చేయాల్సిన పరిస్థితి ఉందని గురుకుల కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, వీర మహిళా నాయకురాలు కొండాపురం కస్తూరి, నందిని యాదవ్, కార్యాలయ ఇన్చార్జి జమీర్, జనసేన నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, రుషి, అనుదీప్‌రెడ్డి, ప్రశాంత్ గౌడ్, వవన్ యాదవ్, వర్షన్, పవన్, జనార్ధన్, రాము, గుర్రం కిషోర్, మహేష్, షఫి, యాసిన్, అకీబ్, ఆబీద్, ఫిరోజ్, హుజైఫా, అమన్, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా 9వ వార్షికోత్సవ ఉత్సవాలు

## ముఖ్య అతిథిగా హాజరైన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి









(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)

సంయుక్త ప్రాంతీయ కేంద్రం సి ఆర్ సి నెల్లూరు నందు తొమ్మిదవ వార్షికోత్సవ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ముఖ్యఅతిథిగా శ్రీనివాస రావు ప్లాంట్ హెడ్ జిందాల్ పవర్ లిమిటెడ్ సింహపురి యూనిట్, అతిథులుగా వెంకటసుబ్బయ్య అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్ఎస్ఎ నెల్లూరు, సిద్ధ నాయక్ మెడికల్ సూపర్డెంట్, స్వప్న హెచ్వోడి డ్రీం ఫౌండేషన్, మస్తాన్ వైస్ ప్రిన్సిపల్ ఏ ఎస్ ఆర్ మెడికల్ కాలేజ్ ,శిరీష కేర్ ఇండియా కోఆర్డినేటర్ విచ్చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంయుక్త ప్రాంతీయ కేంద్రం నెల్లూరు డైరెక్టర్ మనోజ్ కుమార్ ఎస్పీ దివ్యాంగుల పిల్లలకు కావలసిన పునరావస్తు చికిత్సలు మాత్రమే కాకుండా వారిని క్రీడల్లో తో పాటు కల్చరల్ ఆక్టివిటీస్ లో వారిని ప్రోత్సహించాలని, అలాగే సిఆర్సి నెల్లూరు మండల్ లెవెల్ అవేర్నెస్ క్యాంప్ 32 మండలాల్లో కండక్ట్ చేస్తున్నామని, టెలికాన్ ఫ్రెండ్స్ మీటింగ్ ద్వారా ఎంపీడీవోస్ మరియు జెడ్పి సీఈఓ గారి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. రియాబిటేషన్ సర్వీసెస్ ఓరియంటేషన్ గురించి, సింహపురి యూనివర్సిటీ వారితో ఎంఓయూ చేసుకున్నామని క్యూర్ ఇండియా వారితో ఎంఓయూ చేసుకున్నామని దివ్యాంగుల పిల్లలకి ఉద్యోగ పోటీ పరీక్షల్లో భాగంగా ఫ్రీ కోచింగ్ ఇస్తున్నామని అలాగే రెండు మొహంలాన్ని అడాప్షన్ చేసుకున్నామని మా యొక్క సర్వీసులు ఇంకా ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలాగా మేము మా యొక్క సేవల్ని కొనసాగిస్తామని తెలియజేయడం జరిగింది. విశిష్ట అతిథి అయిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ 9వ యానివర్సరీలో భాగంగా సిఆర్సి నెల్లూరులో శుక్రవారం గత నెల డిసెంబర్ జరిగిన 19 20 తేదీల్లో జరిగిన పారా ఒలంపిక్ స్పోర్ట్స్ విజేతలకి బహుమతుల ప్రధానం ఇవ్వడం అనేది చాలా సంతోషం కలిగిందన్నారు. అలాగే ఈ యొక్క కేంద్రం ఇక్కడ ఏర్పడింది అనడానికి కారణం పెద్దాయన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుని వారి యొక్క దూరదృష్టి, విలక్షణ ఆలోచన శైలి వల్లనే ఈ యొక్క మండలంలో ఐదు సెంటర్ గవర్నమెంట్ ఇన్స్టిట్యూషన్స్ ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని సిఆర్సి లో ఉన్న ప్రొఫెషనల్ వల్ల మన ప్రాంతపు దివ్యాంగులు అనేకమైనటువంటి రిహబిలిటేషన్ సర్వీసెస్ పొందగలుగుతున్నారని వారి యొక్క సేవలకు మా యొక్క ధన్యవాదాలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమానికి సంబంధించిన విజేతలకు బహుమతులు , ఈ యొక్క ఒలంపిక్స్ క్రీడలను నిర్వహించిన జిందాల్ ప్లాంట్ వారిని ఆయన అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సర్వేపల్లి ఎమ్మెల్యే , క్యూర్ ఇండియా వారి సర్వీస్ సెంటర్ ను సి ఆర్ సి లో ఇనాగ్రేషన్ చేశారు. అలాగే ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు హెచ్ఓపి జిందాల్ పవర్ లిమిటెడ్ సింహపురి యూనిట్ మాట్లాడుతూ సి ఆర్ సి కి సంబంధించిన దివ్యంగులకు సంబంధించినటువంటి సేవలకు మా యొక్క ప్రోత్సాహం మద్దతు అన్నివేళలా ఉంటాయని ఇకముందు కూడా మేము పెద్ద ఎత్తున ఇటువంటి కార్యక్రమాల్లో సి ఆర్ సి తో కలిసి పని చేస్తామని ఇలాంటి ప్రోగ్రాంలో పాల్గొనడం నాకెంతో సంతోషం కలిగించిందని తెలిపారు. అతిథి అయినటువంటి వెంకటసుబ్బయ్య అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మాట్లాడుతూ భవిత సెంటర్ల ద్వారా ఎస్ఎస్సి ద్వారా దివ్యాంగుల పిల్లలకు అనేకమైనటువంటి రిహాబిటేషన్ సేవలు అందివగలుగుతున్నామని మునుముందు మేము కూడా సి ఆర్ సి తో కలిసి కార్యక్రమాల్లో పంచుకొని దివ్యాంగుల్లో నూతన ఉత్సాహం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సిఆర్సి యొక్క సిబ్బంది, బెనిఫిషరీస్, తల్లిదండ్రులు, ఎస్ఎస్సి, ఇతర ఎన్జీవోస్ నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# బియ్యం పంపిణీలో అవకతకవకలు జరిగితే ఉపేక్షించేది లేదు

### రేషన్ వాహనం ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 3)

నిరుపేదలకు పంపిణీ చేయు నాణ్యమైన బియ్యంలో అవకతకవకలు జరిగితే ఉపేక్షించేది లేదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం కనిగిరి పట్టణంలో ని 20వ వార్డులో ఎమ్‌డియూ వాహనాల్లో బియ్యం పంపిణీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం బియ్యం సక్రమంగా ఇస్తున్నారా లేదా తమవద్దే ఉంచుకుని, లబ్ధిదారులతో వేలిముద్ర వేయించి నగదు పంపిణీ చేస్తున్నట్లయితే ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని ప్రజలకు దక్కనీయకుండా అక్రమార్కులు వ్యహరిస్తున్న తీరు బాధాకరమన్నారు. ఇలాంటి పరిణామాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అరునోధర్ కంటు గురవయ్య కొండలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రగడ్డ వెంకటప్ప నాయుడు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జనవరి 3)

లింగసముద్రం మండలం ముత్యాలపాడు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కాట్రగడ్డ వెంకటప్ప నాయుడు భార్య విజయలక్ష్మి శుక్రవారం మరణించారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెంకటప్ప నాయుడు ఇంటికి వెళ్లి విజయలక్ష్మి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

### మూమెంట్ 21 ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం




(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జ్, జనవరి 3)

సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మూమెంట్ 21 పీపుల్స్ మూమెంట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జన్మదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూమెంట్ 21 తిరుపతి జిల్లా కన్వీనర్ అయినటువంటి అక్కరపాక చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమం. మూఢాచార ఆచారాలకు వ్యవహారాలకు అతీతంగా వినూత్న రీతిలో క్రొత్త వరవడిలో కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. మొదటగా సావిత్రిబాయి పూలే ఫోటోను తీసుకుని వచ్చి సభా స్థలంలో ఉంచగా అనంతరం సావిత్రిబాయి పూలే ఫోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. తర్వాత కార్యక్రమంలో మొదట చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 150 సంవత్సరాల క్రితమే సావిత్రిబాయి పూలే మహిళల హక్కుల పట్ల మహిళల చదువు కోసం సమాజ శ్రేయస్సు కోసం అంతేకాకుండా పీడిత వర్గాల చదువుల కోసం దళితుల అభ్యున్నతికి సమా సమాజ స్థాపన కోసం పాటుపడ్డారని తెలియజేశారు. ఆమె చేసినటువంటి కృషి ఫలితమే ఈరోజు ఎంతో మంది మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారని ఎంతోమంది మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని ఎంతోమంది మహిళలు వారి వారి పురుషులతో సమానంగా సమాజంలో జీవించగలుగుతున్నారని ఇంకా మహిళలు ఎంతో సాధించాల్సింది ఉందని ఆయన తెలియజేశారు.

కార్యక్రమంలో సులూరుపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శర్మ మాట్లాడుతూ స్త్రీల అభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే ఆమె చేసినటువంటి కృషి ఆమె ఏర్పాటు చేసినటువంటి సంస్థలు సమాజ శ్రేయస్సుకు ఎంతో బాగా ఉపయోగపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా సావిత్రీబాయి జీవిత చరిత్ర గురించి వక్తృత్వ వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనపరిచిన వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం మహిళా ఉపాధ్యాయు లను శాలువాలతో సావిత్రీబాయి ఫోటో ఉన్న మెమోంటోతో సత్కారం చేసారు.

ప్రధాన వక్తగా మొమెంట్ 21 కో కన్వీనర్ చీరల రెడ్డి సావిత్రి బాయి పూలే చేసిన సేవలగురించి కొనియాడారు. కార్యక్రమం లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి.శారదాంబ మాట్లాడుతూ ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయి అని అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మోమెంట్ 21 నాయకులు కార్యకర్తలు డిగ్రీ కళాశాల లెక్చరర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎటువంటి పత్రాలు లేకుండా వాహనదారులు బయటకు రావొద్దు

### రవాణాశాఖ అధికారుల హెచ్చరిక

### ఒంగోలులో భారీగా ద్విచక్రవాహనాల తనిఖీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)

ఎటువంటి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను రవాణా శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనానికి సంబంధించిన లైసెన్స్, ఆర్ సి ఇతర పత్రాలు లేకుండా బండి నడుపుతున్న వారిని నుండి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున వాహనదారులు అపరాధ రుసుం బారిన పడ్డారు. రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్ ప్రభాకర్, అధికారులు జయప్రకాష్, భాను ప్రకాష్ , ధర్మేంద్ర తదితరులు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, ఒరిజినల్ కాకుండా జిరాక్స్ కాపీలు కచ్చితంగా అధికారులకు చూపించాలని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని వారు తెలిపారు. మొదటిసారిగా అపరాధ రుసుముతో వదిలేస్తున్నామని, ఇదే పదే పదే రిపీట్ అయితే కేసు రాసి కోర్టుకు అప్ప చెబుతామని వారు హెచ్చరించారు.











# గడప, గడపకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు

### ముస్లిం, మైనారిటీ ప్రాంతంలో తొలి పర్యటన

### 80 శాతం ఓట్లు వేసిన వెంకట్‌రెడ్డి నగర్‌లో ఈ సారి పర్యటన లేనట్లే..

### ఇక రెండో విడతలోనే...

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)

నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజులు పాటు గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమం జరగనుంది. మొట్టమొదటిసారిగా మైనార్టీ లు అధికంగా నివసించే గాంధీనగర్ ప్రాంతంలో గిరిధర్ రెడ్డి పర్యటిస్తుండడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గాంధీనగర్ ముస్లిం మైనార్టీలు తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా ఓట్లు వేయడం గమనార్హం. గడపగడపకు గిరిధర్ రెడ్డి కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే గాంధీ నగర్ పరిధిలోని అన్ని వీధుల్లో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు బ్యానర్లతో పాటు ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. మైనార్టీ ప్రాంతంలో ప్రతి ఇంటికి వెళ్లి గిరిధర్ రెడ్డి వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. గాంధీనగర్ కి అనుకొని వెంకటరెడ్డి నగర్ ఉంది ఈ ప్రాంతంలో ప్రజలు సార్వత్రిక ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి 80 శాతానికి పైగా ఓట్లు వేసి మెజారిటీ అందించారు. తొలి విడత పర్యటలో గాంధీనగర్ వరకే పర్యటన షెడ్యూల్ రూపొందించారు రెండో విడతలో వెంకట్ రెడ్డి నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, వీవర్స్ కాలనీ, రామచంద్రారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టనున్నారు. గాంధీనగర్ లో జరుగుతున్న ఏర్పాట్ల కార్యక్రమంలో ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మమతారెడ్డి, డివిజన్ ఇంచార్జ్ గుద్దేటి చెంచయ్య , టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కనపర్తి గంగాధర్, మైనార్టీ అధికార ప్రతినిధి అస్లాం, టిడిపి యువ నాయకులు బీవీ నవీన్ రెడ్డి, గీతాకృష్ణ, శివ మౌలాలి, షాజహాన్, బివి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కిట్స్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి

### ప్రొఫెసర్ సతీష్ ధావన్ వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జనవరి 3)

స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సంఘసంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి, ప్రొఫెసర్ సతీష్ ధావన్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అన్నా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఈ ప్రత్యేకమైన రోజున, భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, దూరదృష్టి గల సావిత్రీబాయి పూలేను మేము గౌరవిస్తామని, విద్య ద్వారా మహిళలను ఉద్ధరించడానికి ఆమె ఎడతెగని ప్రయత్నాలు, సామాజిక సంస్కరణ పట్ల ఆమె అంకితభావం మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉందని తెలిపారు. కిట్స్ కళాశాలలో, ప్రతి వ్యక్తికి జ్ఞానం, సమానత్వం ద్వారా సాధికారత కల్పించడం ద్వారా ఆమె వారసత్వాన్ని ముందుకు తీసుకువెళతామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నామని తెలిపారు. ఆమె చేసిన సేవలను గుర్తుంచుకొని , ఆమె కలలుగన్న సమాజాన్ని నిర్మిద్దామన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఓబన్న పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు







**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 3)**

స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓవన్న స్ఫూర్తితో వడ్డెర సామాజిక వర్గం ప్రజలు ముందుకు సాగాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆవిష్కరించారు. వడ్డెరలు ఎప్పుడు టిడిపికి వెంటే ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు చెందిన బీసీలు ఐక్యంగా టిడిపికి అండగా నిలిచారని, తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని తెలిపారు. బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, బీసీ రక్షణ చట్టం కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకురాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు, మాజీ రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ దేవల మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లెపు ముసలయ్య, వినుకొండ వడ్డెర సంఘం నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం హర్షణీయం

## డిగ్రీ విద్యార్థులకు కూడా తక్షణమే వర్తింప చేయండి

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జనవరి 3)**



ప్రభుత్వ జూనియర్ కళాశాల నందలి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ఈ నెల జనవరి ఒకటి 2025 నుండి అమలు చేసేందుకు జీవో నెంబర్ 40 విడుదల చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు పివి శేషయ్య హర్షం వ్యక్తం చేశారు. అదే సందర్భంలో డిగ్రీ విద్యార్థులకు వర్తింప చేయకపోవడం అన్యాయం అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు ఈ సౌకర్యం కలిగించిందని, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన విద్యార్థి సంఘంగా మేము ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు 2024 ఆగస్టు 15 నుండి ప్రారంభమయ్యే అన్నా క్యాంటీన్ల నుండి మధ్యాహ్నము పూట భోజనం సరఫరా చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మరియు గౌరవ శాసనసభ్యులను కోరడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.తక్షణమే డిగ్రీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం వర్తింపజేసి, ఆకలి సమస్యనుంచి వారిని కాపాడేలా ప్రభుత్వం మానవతను చాటాలని, పివి శేషయ్య ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఘనంగా జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)**

నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం జిల్లాస్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, విక్రమ సింహపురి యూనివర్సిటీ అధ్యాపకులు, స్థానిక కార్పొరేటర్ కామాక్షి దేవి తదితరులు హాజరయ్యారు. 114 వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. 38 మండలాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని జడ్పీ చైర్పర్సన్ సూచించారు. శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే భారతదేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. నేడు మానవజాతి అనుభవిస్తున్న అత్యాధునిక సౌకర్యాలన్నీ విజ్ఞాన శాస్త్ర ఫలాలే అని గుర్తు చేశారు. విద్యార్థులందరూ భావి భారత శాస్త్రవేత్తలుగా రాణించేందుకు, వారి ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు ఎంతో అవసరమని జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు.

# మహిళల్లో మణిపూస సావిత్రిభాయి పూలే

## నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 3)**

స్థానిక ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి నిర్వహిస్తున్న శక్తి సదనంలో శుక్రవారం స్త్రీల ఆశాజ్యోతి, మొట్టమొదటి ఉపాధ్యాయిని అయిన శ్రీమతి సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు బీరం అరుణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా తేళ్ల అరుణ పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, సమితి కోశాధికారి బీరం అరుణ, నరసం జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, వార్డెన్ కమ్ సూపరింటెండెంట్ తమ్మిశెట్టి రమాదేవి, లైజన్ ఆఫీసర్ కే శాంతి లత, గుంటుపల్లి శ్రీదేవి, సిహెచ్ కనకదుర్గ, మలాన్ భాను, పి నాగేంద్రమ్మ తదితరులు పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తేళ్ల అరుణ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే మహిళల్లో మణిపూస అని,విద్య ద్వారా విముక్తిని కోరిన అద్భుతమైన మహిళా మూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. నాళం నరసమ్మ మాట్లాడుతూ ఎన్నో కష్టాలకోర్చి స్త్రీలు బయటికి రాని సమయంలో వారిని ప్రోత్సహించి స్త్రీలకు వెన్ను దన్నుగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహిళ ఆమె అని అన్నారు. అందరూ ఆమె చిత్రపటానికి పూలు వేసి ఆమె త్యాగాన్ని కొనియాడి నివాళులర్పించారు.



# ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నాయకులు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)**



నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా శివలంకి సుధీర్, అక్కయ్య శ్రీహరి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి, వారి చిత్రపటాన్ని బహూకరించి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని సుధీర్ ఆకాంక్షించారు.

# మాజీ నూడా డైరెక్టర్ ఖాజావలి సతీమణి

## పార్థివ దేహానికి నివాళులు అర్పించిన చేజర్ల



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)**

మాజీ నూడా డైరెక్టర్ షేక్ ఖాజావలి సతీమణి, గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ (ఇంతేఖాల్ హొగయ్ )తుదిశ్వాస విడవగా, నెల్లూరు బాలాజీ నగర్ లోని వారి నివాసంలో, ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి, ఖాజావలిని తెలుగుదేశంపార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి పరామర్శించారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు అమ్రుల్లా, రసూల్, దోర్నాల హరిబాబు, ఇందుపూరు మురళీ కృష్ణరెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని కలిసిన వైసీపీ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)**

నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని, 3వ డివిజన్ వైసీపీ నాయకులు ధనుంజయ, రామచంద్రయ్య, నాగార్జున, మల్లికార్జున, నారాయణ రెడ్డి , పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం దిశగా పనిచేస్తామని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి వారు తెలియజేశారు.

# చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష ఐదు లక్షలు పరిహారం

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 3)**

నంద్యాల మండలం నూనె పల్లి గ్రామానికి చెందిన పటా అబ్దుల్ కరీం ఖాన్ అను వ్యక్తి పామూరు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ బాషా అను వ్యక్తి నుంచి 7లక్షల రూపాయలు అప్పుగా తీసుకోని, దాని తాలుకా 5 లక్షలకు చెక్కు ఇవ్వడం జరిగింది. సదరు ఖాదర్ బాషా చెక్కును బ్యాంకులో వేయగా చెక్కు బౌన్స్ అవడం జరిగింది. దాని తాలుకా కేసులో విచారణ జరిగి శుక్రవారం కనిగిరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె భరత్ చంద్ర నిందితునికి ఏడాది జైలు శిక్ష , ఐదు లక్షలు పరిహారం విధిస్తూ తీర్పు ఇచ్చారు.





# నెల్లూరుకు చేరుకున్న వన్ మాన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 3)**



నెల్లూరు ఆర్ అండ్ బి అతిథి గృహానికి వన్ మాన్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా చేరుకున్నారు. రాజీవ్ రంజాన్ మిశ్రాకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, నెల్లూరు ఆర్డీవో అనూష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలా దేవి, షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి ఎస్సీ పౌరులు, సంఘాల నుంచి శనివారం ఉదయం కలెక్టరేట్లో విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు.